ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 05.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 225 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

ఆటలో కీలకమే అయినా పతకం దక్కలే! 12

“

కొన్ని కాలనీలలో రోజూ మందు, చికెన్, మటన్ పంపిణీ చేస్తున్నారు. కొందరు ముఖ్యులకు కూడా వీటిని అందిస్తున్నారు. త్వరలో ఓట్ల సంఖ్యను బట్టి నగదు అందుతుందని వారు హామీ ఇస్తున్నారు. తమ వద్ద నంబర్లు తీసుకున్నారు కానీ, ఇంతవరకు ఏమీ ఇవ్వలేదని పలువురు ఓటర్లు బాహటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని కొన్ని కాలనీలలో గృహోపకరణాలు, ఇతర వస్తువులు పంపిణీకి స్లిప్పులను ఇస్తున్నారు. సమీపంలోని దుకాణాలలో స్లిప్ప ఇచ్చి కుక్కర్లు, మిక్సీలు, కుర్చీలు తీసుకెళుతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4. 01 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారి అడ్రస్ సేకరించి పోలింగ్ కేంద్రాలవారీగా ఇన్చార్జులను నియమించారు.

ధనం దారుణం

ఉప ఎన్నికలో అప్పుడే తాయిలాలు.. మద్యం, మాంసం, నగదు పంపిణీ

- పలు ప్రాంతాలలో బహుమతుల ఆఫర్
- మూడు పార్టీల నేతలదీ అదే తీరు
- సిట్టింగ్ స్థానం నిలుపుకోవాలని బీఆర్ఎస్
- గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్
- ఉనికిని చాటుకునే యత్నంలో బీజేపీ నేతలు
- గల్లీ గల్లీలో చోటా, మోటా నేతల సందడే సందడి
- జాతరను తలపిస్తున్న పార్టీల స్థానిక కార్యాలయాలు
- ఆన్ లైన్ లో నగదు పంపిణీకి పార్టీల యత్నాలు!
- 'జూబ్లీహిల్స్' నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 4 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో పోటీలో ఉన్న ప్రధాన పార్టీలు ఓ పక్క ప్రచారం కొనసాగిస్తూనే, మరోపక్క తాయిలాలతో ఓటర్లకు గాలం వేసేందుకు యత్నాలు ముమ్మరం చేశాయి. ఉప ఎన్నిక అధికార కాంగ్రెస్‌పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీకి జీవన్మరణ సమస్యగా మారింది. ఎలాగైనా గెలవాలనే తాపత్రయంతో తమ ప్రయత్నాలు మూడు పార్టీలు తీవ్రం చేశాయి. ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర పార్టీ నేతలు నిత్యం తీరికలేకుండా పాల్గొంటున్నారు. గతంలో ఏ ఉప ఎన్నికలో జరగని విధంగా ఇంటింటి ప్రచారం, కులాలు, సంఘాలతో భేటీలు కొనసాగుతున్నాయి. గల్లీలో గట్టి లీడర్ ఉంటే తాయిలాలు ఆశ చూపి పార్టీలో చేర్చుకుంటున్నాయి. ఇదిలా ఉంటే ఈనెల 11న పోలింగ్ జరగనుండడంతో ఓటర్లకు కూడా తాయిలాలు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేశాయి. ఇందులో భాగంగానే డబ్బులు

..:: మిగతా 2లో

ఇది సాధారణ పోటీ కాదు

కారుకు, బుల్డోజర్‌కు మధ్య యుద్ధం

- కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతోంది
- ఓటు కోసం అన్ని వర్గాలను మోసం చేస్తోంది
- హైడ్రా భూతం పేరుతో పేదలను వణికిస్తోంది
- ఆరు గ్యారంటీలను ఎప్పుడో అటకెక్కించింది
- కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేది
- నేడు తెలంగాణ నిండా అన్నీ సమస్యలే ఉన్నాయి
- కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలంటే బీఆర్ఎస్ గెలవాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సోమాజిగూడ రోడ్ షోకు భారీగా వచ్చిన జనం

చిటుకుల మైసారెడ్డి, ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 4 : 'ఇది సాధారణ పోటీ కాదు. కారుకు, బుల్డోజర్‌కు మధ్య యుద్ధం' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమాజిగూడలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. రోడ్‌షోకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. జెండాలు ఊపుతూ, నినాదాలతో ఊరేగిన జనసందోహం ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని సృష్టించింది. కేటీఆర్ ప్రసంగం విని ప్రజలలో ఉత్సాహం నెలకొంది. 'మీ ఉత్సాహం చూస్తుంటే గెలుపు ఖాయం అయిపోయింది, ఇప్పుడు మెజార్టీ ఎంత వస్తుందో మాత్రమే నిర్ణయించాలి' అని కేటీఆర్ అన్నారు. హైదరాబాదు అందరినీ కడుపులో పెట్టుకునే నగరమని, కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అన్నం పెట్టే నగరమని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో మన రాష్ట్రం సంపూర్ణ మార్పు పొందిందని అన్నారు. 'కేసీఆర్ సీఎం అయ్యే ముందు ప్రతి ఇంటిలో ఇన్వర్టర్లు ఉండేవి, వేసవిలో జనం నీటి కోసం ఇబ్బంది పడేవారు. ఆయన రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకున్నారు. విద్యుత్,

..:: మిగతా 2లో

అనుకున్నట్టుగానే అజార్ కు శాఖలు

- మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్
- 'అడ్లూరి' నుంచి ఒకటి, సీఎం నుంచి మరొకటి
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం-
- సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపిన అజారుద్దీన్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 4 : ఆరు రోజుల క్రితం రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మహ్మద్ అజారుద్దీన్‌కు

..:: మిగతా 2లో

బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

- 'కాళేశ్వరం' అక్రమాలపై ఎందుకు స్పందించరు?
- సీబీఐకి ఇస్తే కేసీఆర్ ను జైలులో పెడతామన్నారుగా!
- ఇప్పుడు కిషన్ రెడ్డి మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి!
- పదేండ్లలో జూబ్లీహిల్స్ ను ఎందుకు అభివృద్ధి చేయలేదు
- ఉప ఎన్నికను మేము 30 వేల మెజారిటీతో గెలుస్తాం
- రహమత్ నగర్ ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 4 : బీఆర్ఎస్, బీజేపీది పెవికాల్ బంధం అని, కారు పార్టీ మోడీ కంట్రోల్ లో నడుస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ కు కాళేశ్వరం ఏటీఎం అయ్యిందని నాడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా అన్నారని గుర్తు చేవారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి మూడు మాసాలు అవుతున్నా కేసీఆర్ పై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో రూ. లక్ష కోట్లు లూటీ చేసిన కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో చెప్పాలన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన రహమత్ నగర్‌కార్నర్ మీటింగులో ప్రసంగించారు. కాళేశ్వరం మూడేళ్లలో కూలిందని రూ. లక్ష కోట్లు గోదావరిలో కొట్టుకుపోయాయని అన్నారు. ఎప్పటిలోగా కేసీఆర్ ను జైలుకు పంపుతారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కారు రేస్ తో

..:: మిగతా 2లో



'రీయింబర్స్‌మెంట్'పై సంస్కరణలు

- కమిటీని నియమించిన రాష్ట్ర సర్కారు
- స్పెషల్ సీఎస్ తో పాటు 15 మందికి చోటు
- ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంకు కూడా
- కళాశాల యాజమాన్యాల నుంచి ముగ్గురికి చాన్స్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 4 : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామంటూ కాలేజీ యాజమాన్యాలు ప్రకటించాయి. ఈ తరుణంలో రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సంస్కరణల పై కమిటీని ఏర్పాటు చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను కూడా జారీ

..:: మిగతా 2లో

వ్యవసాయం.. దేశ ఆర్థిక ప్రగతికి మూలం

- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం
- 'ఆత్మ నిర్భర భారత్' దిశగా కీలక పాత్ర
- ధాన్యం ఉత్పత్తిలోనూ మనదే అగ్రస్థానం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి
- ఘనంగా అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానోత్సవం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 4 : మన దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడమంటే, వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించుకోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలోని 54 శాతం జనాభా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో

..:: మిగతా 2లో

ప్రపంచాన్ని 150 సార్లు పేల్చగలం

అణ్వాయుధ పరీక్షలు చేపట్టేందుకు జారీ చేసిన ఆదేశాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. అమెరికా వద్ద పుష్కలమైన అణ్వాయుధాలు ఉన్నాయని, ఈ ప్రపంచాన్ని 150 సార్లు పేల్చగలమని చెప్పారు.

11

రైలు ప్రమాదంలో ఆరుగురి మృతి

ఛత్తీస్ గఢ్ లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బిలాస్ పూర్ గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

11

'వరల్డ్ జస్టిస్' ర్యాంకులో ఇండియా @ 86

తాజాగా విడుదలైన వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా ఇండెక్స్-2025లో ఇండియా ర్యాంకు మరింత పతనమైంది. 143 దేశాలకుగానూ నిరుడు 79వ స్థానంలో నిలిచిన భారత్ ఈ యేడాది ఏడు స్థానాలు దిగజారి 86వ ర్యాంకుకు చేరింది.

11

అమెరికాకు తిప్పలు తెచ్చిన 'షట్ డౌన్'

అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ అక్టోబర్ ఒకటి నుంచి మొదలైన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ విభాగాలలో ఉద్యోగుల వేతనాలు, ఇతర చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి.

11

రాజకీయం

రేపటి నుంచి ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

- ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. స్పీకర్ ప్రసాద్ కుమార్ గురువారం నుండి తిరిగి విచారణ జరపనున్నారు. ఆరో తేదీన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను విచారించనున్నారు. తరువాత 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని విచారిస్తారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యవహారంపై మూడు నెలలలోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

ధనం దారుణం

మొదటిపేజీ తరువాయి

ఆన్‌లైన్ చేస్తామంటూ ఆఫర్ చేస్తున్నాయి. బహుమతుల పంపిణీకి షురూకు రంగం సిద్ధం చేశాయి. నువ్వా? నేనా? అన్నట్లుగా నేతలు నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా కాంగ్రెస్ జనంలోకి వెళ్తుంటే, ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం బీఆర్ఎస్, బీజేపీ ప్రచారాస్త్రాలుగా మలుచుకున్నాయి. మలుచుకున్నాయి. పలు కాలనీలలో మద్యం, మాంసం పంపిణీ కొనసాగుతోంది. ఓటర్లకు 'బహుమతులు' ఇచ్చేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఏదీ ఏమైనా ఈ ఉప ఎన్నికతో ఓటర్లకు పండుగే అన్న విధంగా ప్రచారం సాగుతోంది.

మద్యం, మాంసం పంపిణీ

కొన్ని కాలనీలలో మందు, రోజూ చికెన్, మటన్ పంపిణీ చేస్తున్నారు. కొందరు ముఖ్యులకు కూడా వీటిని అందిస్తున్నారు. త్వరలో ఓట్ల సంఖ్యను బట్టి నగదు అందుతుందని వారు హామీ ఇస్తున్నారు. తమ వద్ద నంబర్లు తీసుకున్నారు కానీ, ఇంతవరకు ఏమీ ఇవ్వలేదని పలువురు ఓటర్లు బాహటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని కొన్ని కాలనీలలో గృహోపకరణాలు, ఇతర వస్తువులు పంపిణీకి స్లిప్పులను ఇస్తున్నారు. సమీపంలోని దుకాణాలలో స్లిప్పు ఇచ్చి కుక్కర్లు, మిక్సీలు, కుర్చీలు తీసుకెళుతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారి అడ్రస్ సేకరించి పోలింగ్ కేంద్రాల వారీగా ఇన్చార్జులను నియమించారు. ప్రతి వంద మందికి ఓ బాధ్యుడిని నియమించుకున్నారు. వీరిలో కనీసం మూడు లక్షల మందికి బహుమతులు లేదా నగదును అందజేయాలనే లక్ష్యంతో కొంతమంది పని చేస్తున్నారు. ఓటర్లు సైతం మూడు పార్టీల నేతలతో ఉంటూ అందరితో దండుకుంటున్నారు. పార్టీలు ఇచ్చే నగదు, మద్యం, గిఫ్టులు తీసుకుంటున్న ఓటర్లు ఎవరికి ఓటు వేస్తారా? నన్న భయం కూడా పార్టీ నేతలలో వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే క్రీడా పోటీలు

- బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించిన మంత్రి వాకిటి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : తెలంగాణ ప్రభుత్వ విధానాల వల్లనే జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ వేదికగా మారుతోందని క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన 'తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2025' బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహక విధానాన్ని అమలు చేస్తోందన్నారు. హైదరాబాద్ నగరంలో మాత్రమే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాలలో కూడా జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహించే ప్రణాళిక ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ బ్యాడ్మింటన్ క్రీడకు హబ్ లాంటిదన్నారు. దేశానికి అనేక బ్యాడ్మింటన్ ఛాంపియన్లను అందించిన ఘనత తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి దక్కిందని గుర్తు చేశారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ విజయవంతంగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డా. సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, డా. రవితేజ, అనిత, సుజాత, పద్మావతి, స్పెషల్ ఆఫీసర్ బాషా పీఆర్ఓ కాలేరు సురేశ్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు యువిఎన్ బాబు, వంశీధర్, లక్ష్మణ్, కె. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇది సాధారణ పోటీ కాదు

మొదటిపేజీ తరువాయి

తాగునీటి సమస్యలు పూర్తిగా తొలగిపోయాయి. పరిశ్రమలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేశాం. ఐటీ, ఎలక్ట్రానిక్ పాలసీలు తెచ్చి మూడు లక్షల ఐటీ ఉద్యోగాలను పది లక్షలకు పెంచాం. రియల్ ఎస్టేట్, ఇతర రంగాలు కూడా విస్తరించాయి. ఓలా, ఉబర్, జొమాటో వంటి సంస్థల్లో వేలాది గిగ్ వర్కర్లకు ఉపాధి కల్పించాం' అని కేటీఆర్ వివరించారు.

మనతో కాంగ్రెస్ పోటీ పడలేదు

'అభివృద్ధి, సంక్షేమంలో మనతో పోటీ పడే స్థాయిలో కాంగ్రెస్ పార్టీ లేదు. వారు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. ఇమామ్‌లు, పూజారులు, పాస్టర్లు, దళితులు ఎవరినీ వదలలేదు. ఎన్ని హామీలు ఇచ్చారో గుర్తుంచుకోండి. అత్తలకు రూ.4 వేలు, కోడళ్లకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్, మహిళలకు తులం బంగారం, స్కూటీలు, రైతు రుణమాఫీ, యువతకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, మైనార్టీలకు రూ.4 వేల కోట్ల బడ్జెట్ అన్నీ వాగ్దానాలే కానీ ఒక్కటీ అమలు కాలేదు. ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసింది' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'రెండు సంవత్సరాలలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ చెప్పారు, విద్యార్థులు నమ్మారు. ఇప్పుడు ఆ విద్యార్థులే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూడా ఈ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదు. కాలేజీలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది' అని విమర్శించారు. 'ఉద్యోగుల పీఆర్సీ పెండింగ్‌లో ఉంది. పెన్షనర్లు రెండేళ్లుగా బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. వారి గుండెలు ఆగిపోతున్నాయి కానీ, రేవంత్ రెడ్డి గుండె కరగడం లేదు. రేవంత్ నడుపుతున్నది ప్రభుత్వం కాదు, బెదిరింపుల దర్బార్. కొత్త ఉద్యోగులలో కూడా భయం నింపే ప్రయత్నం చేస్తున్నారు. తల్లిదండ్రులను చూసుకోకపోతే జీతంలో 15 శాతం కోత వేస్తానంటూ హెచ్చరిస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించని రేవంత్ రెడ్డి జీతంలో కూడా కోత వేయాలి కదా?' అని విమర్శించారు.

పెద్దలను వదిలి పేదల ఇండ్లు కూల్చారు

పేదల ఇళ్ల కూల్చివేతలపైనా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇండ్లు కూలగొట్టడమే ఇందిరమ్మ రాజ్యం అని కాంగ్రెస్ సర్కారు చెప్పుకుంటోంది. హైడ్రా భూతం పేదల ఇండ్లను కూల్చుతోంది. చిన్నారులు బుక్స్ తీసుకురావడానికి వెళ్లినా బయటకు లాగి ఇళ్లు కూల్చేశారు. కానీ, పెద్దల ఇళ్లకు మాత్రం హైడ్రా వెళ్లదు. తిరుపతి రెడ్డి ఇంటికి వెళ్లదు, పొంగులేటి, వివేక్ ఇండ్లకు హైడ్రా వెళ్లదు. బుల్డోజర్ సర్కార్‌కు బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకు ఓటేయాలి. కేసీఆర్ ఇచ్చిన పేదల పథకాలను ప్రభుత్వం నిలిపేసింది. రంజాన్ తోఫా లేదు, బతుకమ్మ చీర లేదు, క్రిస్మస్ గిఫ్ట్ లేదు, రైతు బీమా లేదు, రైతు బంధు లేదు. ఉచిత నీటి పథకం కూడా రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చని కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ ఒక్క చాన్స్ అడుగుతోంది. ప్రజలు ఒక్క చాన్స్ ఇచ్చినందుకే రాష్ట్రం భ్రష్టుపట్టింది' అని కేటీఆర్ విమర్శించారు. 'ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి. ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి. మళ్లీ కేసీఆర్ రావాలంటే జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర మొదలవ్వాలి' అని కేటీఆర్ అన్నారు.

పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

- సీసీఐ సీఎండీతో మాట్లాడిన మంత్రి తుమ్మల

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాతో మంగళవారం ఫోన్ లో మాట్లాడారు. పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు యథావిధిగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. తేమ శాతం, స్లాట్ బుకింగ్ పై పత్తి రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. జిన్నింగ్ మిల్లర్లు లేవనెత్తిన డిమాండ్లను కూడా వివరించారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే పత్తి కొంటామనే నిబంధన ఎత్తివేయాలని సూచించారు. పత్తి తేమ శాతం 12 శాతం పైగా ఉన్నప్పటికీ కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకోవాలని తుమ్మల కోరారు. అనంతరం జిన్నింగ్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డితో ఫోన్ లో మాట్లాడారు.

వ్యవసాయం.. దేశ ఆర్థిక ప్రగతికి మూలం

మొదటిపేజీ తరువాయి

18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. ఆత్మనిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ బలంగా నమ్ముతారని చెప్పారు. అందుకే, అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ యేడాది చైనాను దాటేసి

149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు.

పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తొలిస్థానం

పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా దేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా ఐదు కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ రూ. 50 కోట్లు మింగేశారని, కేటీఆర్ ఆరెస్టుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్ ను కోరితే ఇప్పటి వరకు జవాబు లేదన్నారు. దీంతోనే బీఆర్ఎస్, బీజేపీ ఫెవికాల్ బంధం అర్థం చేసుకోవాలని ఓటర్లను కోరారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలుపుతన్నారని తాననడంలేదని, కేసీఆర్ కూతురు కవిత అంటున్నారని సీఎం గుర్తు చేశారు. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తే, వద్దంటూ కిషన్ రెడ్డి ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసారని ఆరోపించారు. అజార్ కు ఆయన అబ్బసొత్తు ఏమైనా ఇస్తున్నామా? అని నిలదీశారు. మైనార్టీలు బీఆర్ఎస్ కు వేయాలన్నదే కేటీఆర్ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ కు వేసిన ప్రతి ఓటు బీజేపీకి వేసినట్లేనని సీఎం తెలిపారు. అందరి మద్దతు ను చూస్తే ఉప ఎన్నికలో 30 వేల మెజారిటీ తో గెలిపిస్తారని నమ్మకం వచ్చిందని సీఎం అన్నారు.

దిన్ మే లడాయి, రాత్ కు దోస్తానా

బీజేపీ, బీఆర్ఎస్ నేతల తీరు 'దిన్ మే లడాయి, రాత్ మే దోస్తీ' లా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు తీసుకువచ్చిన ప్రతి సంస్కరణలు, బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. మూడుసార్లు బీజేపీకి, రెండుసార్లు బీఆర్ఎస్ కు అవకాశం ఇచ్చినా ఇక్కడి సమస్యలు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం కపట ప్రేమ ఒలికిస్తున్న కేటీఆర్ పదేండ్లు మున్సిపల్‌శాఖ మంత్రిగా ఉన్నాడని, ఇక్కడ మురికిని ఎందుకు పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. ఓట్లు అడిగేందుకు వస్తున్న కేటీఆర్ ను మురికి నాలాలో తొక్కండంటూ సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం పీజేఆర్ కుటుంబానికి సైతం కేసీఆర్, కేటీఆర్ ద్రోహం చేశారని సీఎం ధ్వజమెత్తారు. పేదలకోసం నిత్యం పోరాడి, వేల మందికి గుడెసెలు వేసుకోవాలని అండగా ఉంటూ వారికి ఇళ్ల పట్టాలు ఇప్పించిన పీజేఆర్ అని తెలిపారు. ఈ సభలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట పాల్గొన్నారు.

'రీయింబర్స్‌మెంట్'పై సంస్కరణలు

మొదటిపేజీ తరువాయి

చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రెటరీతో పాటు 15 మందిని ఈ కమిటీలో నియమించింది. ఇక కాలేజీల నుంచి ముగ్గురికి చోటు కల్పిస్తున్నామని ఉత్తర్వులలో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించింది. ఈ కమిటీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. ప్రత్యేక ట్రస్ట్ ద్వారా రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తుంది. మూడు నెలలలో నివేదిక అందజేయాలని ప్రభుత్వం సూచించింది. విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం చేయాలని కూడా పేర్కొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతోంది. సమయానికి ప్రభుత్వం ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయి.

అనుకున్నట్టుగానే అజార్ కు శాఖలు

మొదటిపేజీ తరువాయి

శాఖలు కేటాయిస్తూ సీఎస్ రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మైనార్టీల సంక్షేమ శాఖలను కేటాయించారు. మైనార్టీల సంక్షేమ శాఖ ఇప్పటి వరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వద్ద ఉంది. అలాగే ముఖ్యమంత్రి వద్ద ఉన్న పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను సైతం అజార్ కు కేటాయించారు. అయితే చట్టసభలలో సభ్యుడు కాకుండా నేరుగా మంత్రి పదవి చేపడితే ఆరు నెలలలోపు శాసనసభలోగానీ శాసనమండలి నుంచి గానీ సభ్యత్వం పొందాలి. అలా జరగకపోతే మంత్రి పదవి రద్దవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకత్వం భావించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింలు ఒక్కరూ విజయం సాధించకపోవడంతో పదవి ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన మహ్మద్ అజారుద్దీన్‌కు తిరిగి అక్కడ జరిగే ఉప ఎన్నికలో పోటీ చేసే అవకాశం వచ్చింది. అయితే పార్టీ మాత్రం నవీన్ కుమార్‌యాదవ్‌ను పార్టీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. దీంతో అలకబూనిన అజారుద్దీన్ కు సీఎం మంత్రి పదవి ఇస్తానన్న హామీ ఇచ్చి కేబినెట్ లోకి తీసుకున్నారు. అజారుద్దీన్‌కు గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అజారుద్దీన్‌తో పాటు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎంపిక చేసి గవర్నర్‌కు ప్రతిపాదనలు కూడా పంపారు. కానీ, గవర్నర్ ఇంకా వాటిని ఆమోదించలేదు. కాగా శాఖల కేటాయింపు తరువాత మంత్రి అజారుద్దీన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

డాక్టర్ డ్రగ్స్ దందా, నగరంలో కలకలం

- వృత్తికే కలకలం తెచ్చిన జాన్ పాల్
- ఇంటిలో రూ.3 లక్షల విలువ చేసే డ్రగ్స్ పట్టివేత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : వైద్యులు దేవుడితో సమానం అంటారు. కానీ, ఓ డాక్టర్ పవిత్రమైన తన వృత్తికే కళంకం తెచ్చాడు. ఓ పాడు పని చేస్తూ పోలీసులకు చిక్కాడు. ముషీరాబాద్‌లో ఆ డాక్టర్ ఇంటిలో అధికారులు డ్రగ్స్ పట్టుకున్నారు. దాదాపు మూడు లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్‌ను అరెస్ట్ చేసి, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులతో కలిసి జాన్ పాల్ అనే డాక్టర్ ఢిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి అమ్మకాలు సాగిస్తున్నాడు. పక్కా సమాచారంతో డాక్టర్ ఇంటిలో సోదాలు జరిపిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ బృందానికి భారీగా డ్రగ్స్ లభించాయి. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ముగ్గురు స్నేహితులు కలసి డ్రగ్స్ దందా చేపట్టారు. నగరానికి చెందిన ప్రమోద్, సందీప్, శరత్ అనే యువకులు బెంగుళూరు, ఢిల్లీ నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చిడా. జాన్‌పాల్ నివాసంలో అమ్మకాలు సాగిస్తున్నారు. డాక్టర్ స్వయంగా డ్రగ్స్ వాడటంతో పాటు వాటిని అమ్ముతున్నాడని ఎస్టీఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్సై బాలరాజు, కానిస్టేబుల్ విజయ్ కృష్ణ, సిబ్బంది కలిసి డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో సోదాలు నిర్వహించారని తెలిపారు. అక్కడ నుంచి 26.95 గ్రాముల ఓజి కుష్, 6.21 గ్రాముల ఎండీఎంఏ, 15 ఎల్ఎస్‌డి బాస్ట్స్, 1.32 గ్రాముల కొకైన్, 5.80 గ్రాముల గుమ్మస్, 0.008 గ్రాముల హాసిస్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ డ్రగ్స్ విలువ రూ. మూడు లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రమోద్, సందీప్, శరతులు పరారీలో ఉన్నారు. డాక్టర్ వద్ద ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుకోవడంపై సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం అభినందించారు.

ఫిన్ టెక్ 'గ్లోబల్ కమాండ్ సెంటర్' గా హైదరాబాద్

- 'డాయిష్ బోర్స్ గ్రూప్' జీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : నగరాన్ని గ్లోబల్ ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫిన్ టెక్)కి అత్యంత కీలక గ్లోబల్ కమాండ్ సెంటర్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు ఆయన రాయదుర్గంలో అంతర్జాతీయ దిగ్గజ ఫైనాన్షియల్ మార్కెట్ సంస్థ 'డాయిష్ బోర్స్ గ్రూప్' గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పిల్లర్‌గా ఉన్న డాయిష్‌బోర్స్ గ్రూప్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం రాష్ట్ర ప్రభుత్వ పటిష్ట పాలసీలు, స్థిరత్వం, ఇక్కడి టాలెంట్ పూల్‌పై గ్లోబల్ కంపెనీలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచంలోని టాప్ టెన్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలలో ఏడు ఇక్కడ నిర్వహించడం గర్వకారణమన్నారు. డాయిష్ బోర్స్ రాకతో హైదరాబాద్ గ్లోబల్ క్యాపిటల్, సంపదకు శక్తినిచ్చే కేంద్రంగా అంతర్జాతీయ యవనికపై మరోసారి నిరూపించుకుందన్నారు. నగరాన్ని ఇంక్యుబేషన్ హబ్‌గా మాత్రమే కాకుండా 'గ్లోబల్ ఆవిష్కరణ పవర్‌హౌస్'గా మార్చేలా ఒక ప్రత్యేక గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించబోతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చే వాల్యూను కూడా సృష్టించేందుకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ జీసీసీ షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి ప్రధాన ఎక్స్ఛేంజీలతో సహా 24 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహించే గ్లోబల్ మార్కెట్లకు అత్యున్నత సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డ్యుయిష్ బోర్స్ సీఐఓ డా. క్రిస్టోఫ్ బోమ్, డైరెక్టర్ డాక్టర్ లుడ్విగ్ హీన్సెల్‌మన్ పాల్గొన్నారు.



ఇండియా 'గ్లోబల్ సూపర్ పవర్' కంట్రీ. రెండు దేశాల సంబంధాలు గతంలో కన్నా మరింత బలపడ్డాయి. డిఫెన్స్, ట్రేడ్, కౌంటర్ టెర్రరిజమ్, ట్రేడ్‌లలో తమ బంధాన్ని విస్తరించాం. హమాస్ దాడి సమయంలో మద్దతుగా నిలిచిన ఇండియాను ఎప్పుడూ గుర్తుంచుకుంటాం. తమకు ముప్పుగా ఉన్న పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించలేము.

- ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోన్ సర్

సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యం

- ప్రజలందరిలో మమేకం కావాలన్నదే మా తపన
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఆదిలాబాద్ లో కొనసాగిన జాగృతి 'జనం బాట'

ప్రతిపక్షం బ్యూరో ఆదిలాబాద్, నవంబర్ 4: సామాజిక తెలంగాణ సాధనమే తమ లక్ష్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం పలు ప్రాంతాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సామాజిక తెలంగాణ సాధనమే తమ లక్ష్యమని తెలిపారు. 'మా అజెండా నచ్చినా, నచ్చకపోయినా అందరికీ స్వాగతం' అంటూ ప్రజలతో మమేకమవ్వడమే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయి కానీ, ఇంకా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఎన్నో ఉన్నాయి. రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, పేద ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆదిలాబాద్ పత్తి రైతుల దుస్థితిని స్వయంగా పరిశీలించిన కవిత 'మొంథా తుపాను ప్రభావం ముందే తెలిసినా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోలేదు. తేమ శాతం సమస్యపై కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారానికి అంగీకారం పొందాం. రైతుల పట్ల ప్రభుత్వానికి బాధ్యత ఉండాలి' అని అన్నారు. చనాఖా- కొరటా, కుప్టి, సిరిచెలిమ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, మరో 10 శాతం పనులు పూర్తి చేస్తే వేల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు.

నిరుద్యోగుల సమస్యలపై మండిపాటు

జిల్లా సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులతో మాట్లాడిన కవిత 'కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, కానీ, ఇప్పటివరకు ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని' డిమాండ్ చేశారు. లైబ్రరీలలో మిడ్ డే మీల్స్, జనరేటర్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రిమ్స్ హాస్పిటల్‌ను పరిశీలించి శానిటేషన్ పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కార్డియాలజిస్ట్ నియామకం అవసరం. క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి, జిల్లా హెల్త్ ప్రొఫైల్ స్టడీ చేయాలి' అని అన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. ఇక్కడి గిరిజనుల త్యాగాలు తెలంగాణకు మార్గదర్శకాలని, ఆ స్ఫూర్తితో ప్రజల కోసం పనిచేస్తామని కవిత అన్నారు. ఆదిలాబాద్‌లో అండర్ బ్రిడ్జ్‌లు, ఓవర్ బ్రిడ్జ్‌లు, వంద పడకల ఆస్పత్రి, వెల్ఫేర్ హాస్టల్ భవనాలు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదిలాబాద్‌లో పరిశ్రమలు లేకపోవడం బాధాకరమని, రైల్వే లైన్, ఐటీ టవర్, టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు.

చేవెళ్ల బస్సు ప్రమాదంపై హెచ్ఆర్సీ విచారణ

- 15లోగా నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, నవంబర్ 4 : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదం ఎన్నో కుటుంబాలలో విషాదాన్ని నింపింది. ఈ ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసింది. డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని రోడ్లు, భవనాలు, రవాణా శాఖల అధికారులకు, హోమ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఆదేశాలు జారీ చేసింది. అలాగే, రంగారెడ్డి జిల్లా కలెక్టర్,ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ కూడా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. మరోవైపు చేవెళ్ల బస్సు ప్రమాదంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ప్రమాద స్థలాన్ని డీజీపీ శశిధర్ రెడ్డి, సీపీ అవినాష్ మహంతి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. సోమవారం నాడు తెల్లవారుజామున తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయపడటంతో వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వచ్చే నెల రోడ్డు ప్రమాదాలపై అవగాహన

- దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయి
- బస్సును టిప్పర్ లాక్కెళ్లడంతోనే తీవ్రత పెరిగింది
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీజీపీ శివధర్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, టిప్పర్ అతివేగంగా వచ్చి బస్సును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. బస్సులో రైట్ సైడ్ కూర్చున్న వారు చాలా మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. రోడ్డు మలుపు ఉన్నా, అది యాక్సిడెంట్ అయ్యేంత తీవ్రంగా లేదన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని రెడ్డి పేర్కొన్నారు. టిప్పర్ కండిషన్‌ను పరిశీలిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని, ఇది అందరి బాధ్యతగా చూడాలని అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల కారణంగానే మరణిస్తున్నారని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాలపై వచ్చే నెల నుంచి అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ప్రమాదానికి సంబంధించిన అన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీజీపీ వెల్లడించారు.

కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- సీఈఓ, ఆర్ఓకు మెట్టు సాయికుమార్ ఫిర్యాదు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : కొన్ని మీడియా ఛానల్స్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద తప్పుడు ఆరోపణలు చేస్తూ, నకిలీ సర్వే రిపోర్టులు ప్రసారం చేస్తున్నాయని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి, జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ కు మంగళవారం ఫిర్యాదు చేసారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సర్వేలు, నిర్ధారణ లేని వార్తలు ప్రసారం చేశారని పేర్కొన్నారు. ఈ చర్యలు ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన మాత్రమే కాకుండా, భారత శిక్షాస్మృతి సెక్షన్ 499, 500 ప్రకారం దూషణాత్మక నేరం కిందకు వస్తాయని అన్నారు. తప్పుడు ప్రచారాలు సీఎం ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, ఓటర్లను తప్పుదారి పట్టించే ప్రయత్నమని విమర్శించారు. ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకుని, ఇలాంటి దుష్ప్రచారం, నకిలీ సర్వేలు కొనసాగకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు

- యూసుఫ్ గూడా మైనారిటీ నేతలతో మంత్రి 'పొన్నం'

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : రేవంత్ నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉప ఎన్నికలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై పని చేస్తున్నాయన్నారు. తాము సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. మహమూద్ ఫంక్షన్ హాలులో యూసుఫ్ గూడా డివిజన్ మైనార్టీ నేతలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్ మంగళవారం సమావేశమయ్యారు. ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథ్, సంపత్ కుమార్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్ రెడ్డి, శివసేనారెడ్డి, నిర్మలాజగ్గారెడ్డి, నూతి శ్రీకాంత్ గౌడ్, వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని, తాము అర్హతగా ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. అందిస్తున్నాం. జూబ్లీహిల్స్ ప్రజలకు మంచి అవకాశం వచ్చిందని, నవీన్ యాదవను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీకి వేసిన ఓటు బీఆర్ఎస్ కు వేసినట్టేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికుడు, విద్యావంతుడు నిత్యం ప్రజలలో ఉండే వ్యక్తి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.

నగరంలో ఆగని డ్రగ్స్ దందా

- టీఎన్జీఓ కాలనీలో మెరుపు దాడులు
- 13 మందిని అరెస్టు చేశామన్న డీసీపీ ఉదయ్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : రాష్ట్రంలో మత్తు పదర్థాల విక్రయాలు, సేవనం మీద ప్రభుత్వం ఉక్కుపాదం మోపినప్పటికీ,నిత్యం ఎక్కడో ఒక దగ్గర మత్తు పదార్థాలు విక్రయాలు, సేవిస్తున్నవారు పట్టుబడుతూనే ఉన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. అందుకు వీలుగా ప్రత్యేక ఓ టీంను కూడా ఏర్పాటు చేసారు. నగరంలోని గచ్చిబౌలి టీఎన్జీఓ కాలనీలో ఎస్ఎం లగ్జరీ గెస్ట్ రూమ్, కో లివింగ్ గెస్ట్ రూమ్‌లో జరుగుతున్న డ్రగ్స్ పార్టీని ఎస్ఓటీ పోలీసులు మంగళవారం భగ్నం చేశారు. భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కో లివింగ్ హాస్టల్‌లో తేజ కృష్ణ, లోకేష్ రెడ్డి వద్ద డ్రగ్స్ లభించాయని చెప్పారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మరో నలుగురు హోటల్ నైట్ ఐలో దొరికారన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద కూడా డ్రగ్స్ లభించాయని తెలిపారు. ఈ కేసులో 13 మందిని అరెస్ట్ చేశామని, మరో ఆరుగురు పరారీలో ఉన్నారని చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో ఆరుగురు ఫెడ్లర్లు, ఐదుగురు వినియోగదారులు ఉన్నారని అన్నారు. బెంగళూరులో ఉంటున్న ఇద్దరు నైజీరియన్ల నుంచి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు చేశారని డీసీపీ వెల్లడించారు. మరో ఇద్దరు నైజీరియన్లు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి తేజ లోకల్‌గా ఉన్న యువత, స్టూడెంట్లకు అమ్ముతారన్నారు.

వెంటనే ఫీజు బకాయిలు చెల్లించండి

- ఉన్నత విద్యామండలి ముట్టడించిన విద్యార్థులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ వేలాది మంది విద్యార్థులు మంగళవారం నాడు ఉన్నత విద్యా మండలిని ముట్టడించి ఆందోళన చేపట్టారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడిలో విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఆంక్షలు, కోతల పేరుతో పథకాన్ని ఎత్తివేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. 14 లక్షల 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు గాలిలో దీపంలా మారిందన్నారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే త్వరలో లక్షలాది మంది విద్యార్థులతో విద్యార్థి మార్చ్ నిర్వహిస్తామని రామకృష్ణ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. తొమ్మిది వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల మీద ఒత్తిడి తెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేక ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు రోజురోజుకు పెరుగుతున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్సుమెంటు మీద కాదు, మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్ల జీతాలలో కోతలు విధించాలని డిమాండ్ చేశారు.

విశాఖలో ఆకస్మిక భూప్రకంపనలు

- భయాందోళనకు గురైన స్థానికులు

ప్రతిపక్షం ప్రతినిధి, విశాఖపట్నం, నవంబర్ 4: విశాఖ నగరాన్ని మంగళవారం తెల్లవారుజామున 4.24 నిమిషాలకు స్వల్ప భూకంపం వణికించింది. నగరంలోని పలు ప్రాంతాలలో భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొందరు ఇండ్ల బయటకు పరుగులు తీశారు. ముఖ్యంగా మురళీనగర్, గాజువాక, మాధురవాడ, ఎంవీపీ కాలనీ, గోపాలపట్నం ప్రాంతాలలో తేలిక పాటి ప్రకంపనలు వచ్చాయని స్థానికులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.0 గా నమోదై ఉండవచ్చని భూకంప శాఖ అంచనా వేసింది. భూకంపం తక్కువ తీవ్రతతోనే ఉన్నప్పటికీ, ప్రజలలో ఆందోళన నెలకొంది. కొందరు భయంతో ఇళ్ల బయటే గడిపారు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వివరాలు లేవని అధికారులు తెలిపారు. అయినప్పటికీ, జాగ్రత్త చర్యలుగా ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బహరేన్‌లో గల్ఫ్ కార్మికుడి అంత్యక్రియలు

- సమ్మతించిన మృతుని భార్య: అఫిడవిట్ సమర్పణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 4 : జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు శ్రీపాద నరేష్ ఐదేండ్ల క్రితం బహరేన్‌లో మృతి చెందాడు. ఆయన మృతదేహం ఇప్పటివరకు అక్కడే ఉంది. మృతదేహాన్ని భారతదేశానికి తరలించడం సాంకేతిక కారణాల వల్ల సాధ్యం కాదని బహరేన్‌లోని భారత రాయబార కార్యాలయం స్పష్టంచేసింది. దీంతో బహరేన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు సమ్మతిస్తూ భార్య శ్రీపాద లత నోటరీ అఫిడవిట్ పై సంతకం చేశారు. తదుపరి చర్యల కోసం కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్, సీఎం ప్రవాసీ ప్రజావాణి కార్యాలయాన్ని సందర్శించి, మృతుని సోదరుడు ధర్మపురి ఆనంద్ తో కలిసి అఫిడవిట్ పత్రాన్ని ప్రజావాణి ఇన్‌చార్జి డా. జి. చిన్నారెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ, బహరేన్‌లోని భారత రాయబార కార్యాలయంతో తెలంగాణ ప్రభుత్వం సమన్వయం చేసుకొని, అక్కడే సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని అన్నారు. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ బహరేన్‌కి వెళ్లి అంత్యక్రియలలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సామాజిక సేవకులు మొరపు తేజ, ఆకుల ప్రవీణ్, బొజ్జ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు. బహరేన్‌లోని సామాజిక కార్యకర్తలు డి.వి. శివకుమార్, కోటగిరి నవీన్ కుమార్, నోముల అంత్యక్రియలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.

ప్రతి 40 రోజులకు ఒక స్వదేశీ యుద్ధనౌక లేదా జలాంతర్గామిని ఇండియన్ నేవీలోకి చేరుస్తున్నాం. 2035 నాటికి 200కు పైగా వార్ షిప్‌లు, సబ్‌మెరైన్లు కలిగి ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రస్తుతం 52 నౌకలు భారత షిప్‌యార్డుల్లోనే నిర్మితమవుతున్నాయి. ప్రస్తుతం మన వద్ద 145 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు ఉన్నాయి.

- చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి

ఓపెన్ వాయిస్

విస్తరణ పనులలో జాప్యం ఎందుకు?

ఆర్థిక స్థిరత్వం ఉన్నవారు కార్లు కొనుగోలు చేస్తారు. సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయడానికి కార్లనే ఉపయోగిస్తారు. మధ్యతరగతి, పేదలు మాత్రం ఆర్టీసీ బస్సులలోనే వెళ్తారు. నేటి కాలంలో కూడా పేదలకు, మధ్యతరగతి వారికి ఆర్టీసీ బస్సులు అనేది అత్యంత నమ్మకమైన ప్రయాణ సాధనాలుగా ఉన్నాయి. పైగా ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల చాలామంది మహిళలు బస్సులోనే ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ బస్సులను సుశిక్షితులైన డ్రైవర్లు నడుపుతారు. అందువల్లే చాలామంది ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడానికి ఇష్టపడుతుంటారు. ఇటీవల కాలంలో ప్రయివేటు బస్సులలో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్న నేపథ్యంలో చాలామంది ఆర్టీసీ బస్సులనే నమ్ముతున్నారు. బస్సులను డ్రైవర్లు సమర్థవంతంగానే నడుపుతున్నప్పటికీ, బిజీ రోడ్ల మీద ఎదురుగా వచ్చే వాహనాలతో బస్సులు ప్రమాదానికి గురవుతున్నాయి. సోమవారం మీర్జాగూడ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో బస్సు ప్రమాదానికి గురి కావడానికి ప్రధాన కారణం కంకరలోడుతో వస్తున్న టిప్పర్. రోడ్డు మీద ఉన్న గుంతను తప్పించబోయి టిప్పర్ డ్రైవర్ బస్సును ఢీకొట్టాడు. రెండు వాహనాలు కూడా విపరీత వేగంతో ఉండడం, టిప్పర్ బస్సును అత్యంత వేగంగా ఢీకొట్టడంతో ప్రమాద తీవ్రత అధికంగా ఉంది. బస్సు డ్రైవర్ అక్కడికక్కడే చనిపోయాడు. వారం రోజుల వ్యవధిలోనే రెండు బస్సు ప్రమాదాలు రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కర్నూలు, చేవెళ్ల ప్రమాదాలు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా నిలిచాయి. కర్నూలు అగ్నిప్రమాదంలో 19 మంది, చేవెళ్ల ఆర్టీసీ దుర్ఘటనలో 19 మంది మరణించడం దిగ్భ్రాంతి కలిగించే అంశం. ప్రజా కర్షక ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకాలు, వాటికి అనుగుణంగా మౌలిక వసతులు, రవాణా వ్యవస్థను సిద్ధం చేయకపోవడంతోనే ఈ దుర్ఘటనలు సంభవించాయి. ఒకవైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేస్తూ, మరోవైపు పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు నడపకపోవడం ఆర్టీసీ సంస్థ తీవ్ర వైఫల్యంగా పేర్కొనవచ్చు. సోమవారం చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణాల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం ఆర్టీసీ బస్సులో ఓవర్‌లోడింగ్ ఉండటమే. ఉచిత ప్రయాణ పథకం ద్వారా బస్సులలో రద్దీ విపరీతంగా పెరిగినప్పటికీ, సంస్థ అదనపు సర్వీసులను నడపడానికి బదులు, ఉన్న బస్సులలోనే సీటింగ్ సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటుంది. ప్రజా రవాణా వ్యవ స్థ నిబంధనల ప్రకారం ఇది స్పష్టమైన ఉల్లంఘన. ప్రయాణికులకు భద్రత కల్పించడంలో ఆర్టీసీ విఫలమైంది. ఈ ఓవర్‌లో డింగ్‌కు బాధ్యులైన అధికారులపై, సిబ్బందిపై తక్షణమే నియమాలను అనుసరించి చర్యలు తీసుకోవాలి. బస్సు ప్రమాదానికి మరో కీలక కారణం జాతీయ రహదారి విస్తరణ పనులు యేండ్ల తరబడి నిలిచిపోవడం. రద్దీగా ఉండే ఈ మార్గాన్ని ఇరుకుగా ఉంచడం, మౌలిక సదుపాయాల లోపాన్ని తెలియజేస్తోంది. స్థానిక రాజకీయ వివాదాలు, పర్యావరణ అనుమతుల సాకులతో రోడ్డు పనులను పెండింగ్‌లో ఉంచడం అనేది అధికారుల విధుల పట్ల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. ఓవర్‌లోడింగ్‌తో ఉన్న ఆర్టీసీ బస్సు, ఇరుకు రోడ్డుపై అతివేగంతో వచ్చి లారీని ఢీకొనడం పాలనా వైఫల్యానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. అయితే, ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు కొత్తేమీ కాదు. ఇప్పటివరకు ఈ చేవెళ్ల రహదారిపై చోటుచేసుకున్న ప్రమాదాలలో 200 మంది మృతి చెందగా, 600 మంది గాయాలపాలయ్యారు. అసలు ఆ రోడ్డుపై ఎందుకిలా ప్రమాదాలు జరుగుతున్నాయనేది ప్రశ్నార్థకంగా మారిపోయింది. నిజానికి ఎన్ హెచ్ 163 అప్పా జంక్షన్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణం ప్రతిపాదన ఉంది. ఈ రహదారికి ఇరు వైపులా చెట్లు ఎక్కువగా ఉండటంతో గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతుల జాప్యంతో నిర్మాణాలకు బ్రేక్ పడుతోంది. మరి, ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడో మరి!!

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
05.11.2025

గ్రంథాలయాలు జ్ఞానం నుండి జీవితం వరకు

గతంలో గ్రంథాలయాలు 'పుస్తకాల గదులు' అయితే, ఇప్పుడు అవి 'ప్రజల కేంద్రాలు'గా రూపాంతరం చెందుతున్నాయి. డిజిటల్ లైబ్రరీ, మేకర్ స్పేస్, సామాజిక కేంద్రం, సంస్కృతి సంరక్షణ కేంద్రం, ఇవన్నీ ఈ మార్పునకు నిదర్శనాలు. ఈ ప్రయత్నాలు, గ్రంథాలయాలు సమాజంలో చెప్పుకోదగిన భాగస్వామ్యంతో మిగిలిపోవడానికి మార్గాన్ని చూపుతున్నాయి. ఒక గ్రంథాలయం విజయం, ఇప్పుడు దానిలో ఎన్ని పుస్తకాలు ఉన్నాయన్న దానిపై కాకుండా, అది ప్రజల జీవితంలో ఎంత మార్పును తెస్తుందనే దానిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, భవిష్యత్తులో గ్రంథాలయాలు, జ్ఞానం ద్వారాలు మాత్రమే కాకుండా, సృజనాత్మకత కార్యశాలలు (ప్రదర్శనా కేంద్రాలుగా) సామాజిక బంధాల సేతువులుగా విదేశీ గ్రంథాలయలకు ఏమాత్రం తీసిపోని విధంగా మన గ్రంథాలయాలు వెలుగొందాలని ఆశిద్దాం.

డా. కోలాహలం రామ్ కిశోర్
9849328496

గ్రంథాలయాలు ఎప్పుడూ జ్ఞాన నిలయాలుగా పరిగణించబడ్డాయి. కానీ, ఈ డిజిటల్ యుగంలో అవి సంప్రదాయ బద్ధమైన తమ విధి విధానాలను, స్వరూప స్వభావాలను క్రమంగా మార్చుకొంటున్నాయి. ఈ సంస్థలు కేవలం పుస్తకాలు ఇచ్చిపుచ్చుకొనే స్థలాలుగా మిగిలిపోతే, అవి సమాజంలో తమ ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ సవాలును అర్థం చేసుకున్న ప్రపంచంలోని అనేక గ్రంథాలయాలు, అదనపు విలువను జోడించటానికి, కొత్త వినియోగదారులను ఆకర్షించడానికి నవీన పద్ధతులను, రీతులను అవలంబిస్తున్నాయి. ఈ వ్యాసం, అలాంటి కొన్ని సృజనాత్మక గ్రంథాలయ ప్రయత్నాలను (ఇన్నోవేటివ్ లైబ్రరీ ఇన్షియేటివ్ లో) కేస్ స్టడీస్ ల ఆధారంగా విశ్లేషిస్తుంది. ఈ కేస్ స్టడీస్ ల ద్వారా, గ్రంథాలయాలు ఎప్పటికప్పుడు కాలంతో పోటీ పడి, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులకు తగినట్టుగా ఎలా రూపాంతరం చెందుతున్నాయో, భవిష్యత్తులో వాటి రూపురేఖలు ఎలా ఉంటాయో తెలుసుకోవచ్చు.

డిజిటల్ మార్పు: ఆన్ లైన్ లైబ్రరీలు, ఈ- రిసోర్స్

పుస్తకాలను డిజిటల్ రూపంలోకి మార్చడం, ఈ రోజులలో చాలా గ్రంథాలయాల ప్రాథమిక ప్రయత్నంగా కొనసాగుతుంది. ఇందుకు అత్యంత విజయవంత ఉదాహరణగా 'గూగుల్ బుక్స్' మాత్రమే కాదు, (ప్రాజెక్ట్ గుటెన్ బర్గ్) వంటి స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం గ్రంథాలయ సంస్థలు, విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు కూడా ఈ రంగంలో ముందుకు సాగుతున్నాయి. దీనికి 'డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వీటితో విభిన్న భారతీయ భాషలలో లక్షలాదిగా ఉన్న పుస్తకాలు, పాత పత్రికలు, చారిత్రక డాక్యుమెంట్లు ఆన్ లైన్ లో ఉచితంగా లభ్యమవుతున్నాయి. వీటిని పరిశోధకులు, విద్యార్థులు, పఠనాభిలాష ఉన్న ఎవరికైనా ఒక వరం లాంటిది. ఇంకొక ముఖ్యమైన డిజిటల్ ప్రయత్నం ఏమిటంటే, జర్నల్ ఆర్టికల్స్, రిసర్చ్ పేపర్లు, ఈబుక్స్ ను అందించడం. విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు 'జెస్టోర్' 'స్కోపస్' వంటి డేటాబేస్ లలో సభ్యత్వం తీసుకుంటాయి. వీటి ద్వారా విద్యార్థుల పరిశోధనా ప్రక్రియను చాలా సులభతరం చేస్తున్నాయి. ఈ డిజిటల్ మార్పు, గ్రంథాలయాన్ని ఒక భౌతిక స్థలం నుండి ఇంకొక ఒక 'ఆన్ లైన్ జ్ఞాన కేంద్రం'గా మారుస్తోంది.

సృజనాత్మకతకు కేంద్రం: మేకర్ స్పేస్

గ్రంథాలయాలు ఇప్పుడు పుస్తకాలు చదవడానికి మాత్రమే కాకుండా, కొత్తదాన్ని సృష్టించడానికి కూడా స్థలాలుగా మారుతున్నాయి. ఈ ప్రయత్నానికి 'మేకర్ స్పేస్'లు ఒక గొప్ప ఉదాహరణ. ఇక్కడ వినియోగదారులకు '3డి ప్రింటర్లు', లేజర్ కటింగ్ మెషీన్లు, రోబోటిక్స్ కిట్లు, క్రాఫ్ట్ మెటీరియల్ వంటి అత్యంత ఆధునిక సాధనాలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు, చిన్నపిల్లలు, సాధారణ ప్రజలు వచ్చి, ఈ సాధనాలను ఉపయోగించి తమ ఆలోచనలను నిజం చేసుకోవచ్చు. ఉదాహరణకు, ఒక విద్యార్థి తన ప్రాజెక్ట్ కోసం ఒక మోడల్ తయారు చేయవచ్చు. ఒక కళాకారిణి లేజర్ కటర్ తో కలపపై కళాకృతులు చెక్కవచ్చు. ఇది గ్రంథాలయాన్ని ఒక చురుకైన, సహకార సృజనాత్మక కలిగిన కేంద్రంగా మారుస్తుంది. పుస్తకాలలో ఉన్న సిద్ధాంతాన్ని, ప్రాక్టికల్ గా అనుభవ రూపంతో కలపడానికి ఇది ఒక సృజనాత్మక కళా కాల్పనిక నవీన వేదికగా మారుతుంది. అటు, ఇలాంటి మేకర్ స్పేస్ లు ఇప్పుడు అమెరికా, యూరప్ లోని అనేక గ్రంథాలయాలలో విజయవంతంగా పని చేస్తున్నాయి. భారతదేశంలో కూడా కొన్ని ప్రగతిశీల విశ్వ విద్యాలయాలు వీటిని ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నాయి.

సామాజిక జ్ఞాన కేంద్రంగా గ్రంథాలయం

గ్రంథాలయం ఒక నిశ్శబ్దస్థలం అనే భావన మన మనసులో ఎప్పటి నుండో పాతుకుపోయిఉంది. ఇప్పుడు ఈ భావనను కూడా ఈ నవీన ప్రయత్నాలు మార్చివేస్తున్నాయి. ఆధునిక గ్రంథాలయాలు సమాజంలోని వివిధ వర్గాల ప్రజలను కలిపే సామాజిక కేంద్రాలుగా (సోషల్ హబ్స్ గా) పని చేస్తున్నాయి. ఇందుకు కేస్ స్టడీగా 'డాక్ లైబ్రరీ 1' లైబ్రరీని తీసుకోవచ్చు. ఇది డెన్మార్క్ దేశంలో ఉన్న ఒక అద్భుత గ్రంథాలయం. ఇక్కడ పుస్తకాలతో పాటు, పిల్లల ఆటల మైదానాలు, వయోజనులకు సమావేశాల గదులు, కెఫెటేరియా, మ్యూజిక్ స్టూడియోలు కూడా ఉన్నాయి. ప్రజలు ఇక్కడకి వచ్చి పుస్తకాలు చదవవచ్చు. స్నేహితులను కలవవచ్చు. విభిన్న సమకాలీన సమస్యలపై కళాకృతుల పై చర్చా వేదికలలో పాల్గొనవచ్చు, లేదా కేవలం విశ్రాంతిని కూడా తీసుకోవచ్చు. మరో ముఖ్యమైన ప్రయత్నం, ప్రత్యేక (శారీరక, మానసిక) ఆవశ్యకతలు ఉన్న వారికి సేవలు కూడా అందించడం. కొన్ని గ్రంథాలయాలు ఆటిజం లేదా ఇతర అవాంతరాలు ఉన్న పిల్లలకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వృద్ధులు, నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్ షాప్ లు నిర్వహిస్తున్నాయి. ఈ విధంగా, గ్రంథాలయం సమాజంలోని ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అవిభాజ్యమైన భాగంగా మారుతోంది.

స్థానిక సంస్కృతి - వారసత్వ సంరక్షణా కేంద్రం

గ్రంథాలయాలు తమ ప్రాంతం భాషా, సంస్కృతి, కళ, నాగరికత వారసత్వాన్ని సంరక్షించడంలో కూడా ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి. ఇందుకు 'కేరళ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ' ఒక మంచి ఉదాహరణ. ఈ గ్రంథాలయం, కేరళ ప్రాంతంలోని చారిత్రక పుస్తకాలు, తాళపత్ర గ్రంథాలు, స్థానిక భాషల సాహిత్యాన్ని సేకరించి, సంరక్షిస్తోంది. ఇలాగే, ఈశాన్య రాష్ట్రాలలోని గ్రంథాలయాలు ఆ ప్రాంతాలలోని స్థానిక తెగల జానపద కథలు, సంగీతం, సంప్రదాయాలను డిజిటల్ రూపంలో భద్రపరుస్తున్నాయి. ఈ ప్రయత్నం, ఆధునికీకరణ వేగవంతమైన జీవితంలో కోల్పోతున్న స్థానిక భాషా, సంస్కృతిక జ్ఞానాన్ని కాపాడటానికి ఎంతో సహాయపడుతోంది. గ్రంథాలయం ఇప్పుడు భవిష్యత్తుకు వెళ్లే ముందు, భూతకాలాన్ని కాపాడే ఒక సంరక్షకుడిగా కూడా మారింది.

ఈ ప్రయత్నంలో ఎదురయ్యే కొన్ని సమస్యలు

ఈ నవీన ప్రయత్నాలన్నీ చాలా ప్రశంసనీయమైనవి. కానీ, వాటి ముందు కొన్ని ముఖ్య సమస్యలు, సవాళ్లు కూడా ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి చాలినంత నిధుల కొరత, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, కొందరిలో సంప్రదాయవాదులు పాత ఆలోచనలు వీడలేకపోవటం. ఆధునీకరణ అంతా చెడ్డది అనే భావన నూ వీడలేకపోవటం. చిన్న గ్రంథాలయాలకు ఖరీదైన '3డి ప్రింటర్లు' లేదా డిజిటల్ లైబ్రరీ సాఫ్ట్ వేర్ కొనడం సాధ్యం కాకపోవచ్చు. పాతతరం వినియోగదారులు, ఈ మార్పులను అంగీకరించడంలో కూడా సంకోచిస్తున్నారు. భవిష్యత్తులో, గ్రంథాలయాలు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) తో మరింత వ్యక్తిగతీకరించిన సేవలను అందించవచ్చు. ఉదాహరణకు, (ఏఐ) ఒక విద్యార్థి ఆసక్తులను అనుసరించి, అతనికి సరైన పుస్తకాలను సూచించవచ్చు. వర్చువల్ రియాలిటీ (వీఆర్) ద్వారా, ఒక విద్యార్థి చారిత్రక స్థలాన్ని వర్చువల్ గా పర్యటించడం లేదా శాస్త్రీయ ప్రయోగం చేయడం సాధ్యపడుతుంది.

ఇప్పుడు అవి 'ప్రజల కేంద్రాలు'గా

చివరిగా, గతంలో గ్రంథాలయాలు 'పుస్తకాల గదులు' అయితే, ఇప్పుడు అవి 'ప్రజల కేంద్రాలు'గా రూపాంతరం చెందుతున్నాయి. డిజిటల్ లైబ్రరీ, మేకర్ స్పేస్, సామాజిక కేంద్రం, సంస్కృతి సంరక్షణ కేంద్రం, ఇవన్నీ ఈ మార్పునకు నిదర్శనాలు. ఈ ప్రయత్నాలు, గ్రంథాలయాలు సమాజంలో చెప్పుకోదగిన భాగస్వామ్యంతో మిగిలిపోవడానికి మార్గాన్ని చూపుతున్నాయి. ఒక గ్రంథాలయం విజయం, ఇప్పుడు దానిలో ఎన్ని పుస్తకాలు ఉన్నాయన్న దానిపై కాకుండా, అది ప్రజల జీవితంలో ఎంత మార్పును తెస్తుందనేదానిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, భవిష్యత్తులో గ్రంథాలయాలు, జ్ఞానం ద్వారాలు మాత్రమే కాకుండా, సృజనాత్మకత కార్యశాలలు (ప్రదర్శనా కేంద్రాలుగా) సామాజిక బంధాల సేతువులుగా విదేశీ గ్రంథాలయలకు ఏమాత్రం తీసిపోని విధంగా మన గ్రంథాలయాలు వెలుగొందాలని ఆశిద్దాం. అందుకు గ్రంథ పాలకులు తగిన అధునాతన సాంకేతిక శిక్షణ పొంది సిద్ధంగా ఉండాలి. నూతన విషయాలను ఆకళింపు చేసుకుని వాటిని మన దేశ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొనే నైపుణ్యం, అభిరుచి, ఆసక్తిని కలిగి ఉండాలి. అందుకు బుక్ లవర్స్, విద్యావంతులు, స్కాలర్లు, మేధావులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరించాలి.

(వ్యాస రచయిత సామాజిక, ఆర్థిక విశ్లేషకులు)

'జీశాట్7ఆర్' భారత నావికాదళానికి కొత్త శక్తి

రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సంక్లిష్టమైన భద్రతా సవాళ్ల మధ్య, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడాలనే భారత నావికాదళ సంకల్పాన్ని జీశాట్-7ఆర్ ప్రతిబింబిస్తోంది. ఈ ఉపగ్రహం పూర్తిగా దేశీయంగా తయారవ్వడం, దేశీయ రాకెట్ ద్వారా ప్రయోగించడం వలన, అత్యవసర సమయాలలో విదేశీ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది భారత సార్వభౌమత్వానికి, భద్రతకు అత్యంత కీలకమైన అంశం.

జనక మోహన రావు దుంగ
8247045230

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 2025 నవంబర్ 2న దేశీయంగా అభివృద్ధి చేసిన శక్తివంతమైన లాంచ్ వెహికల్ మార్క్ 3 రాకెట్ ద్వారా భారత నావికాదళానికి చెందిన అత్యంత అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్ 7ఆర్ (సీఎంఎస్ 3) విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టబడింది. ఈ విజయం ఇస్రోకు గొప్ప సాంకేతిక మైలురాయి మాత్రమే కాదు, దేశ రక్షణ సామర్థ్యాలను ఇది గణనీయంగా పెంపొందించింది. అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించాలనే భారతదేశ లక్ష్యానికి ఇది తిరుగులేని నిదర్శనం. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సాయంత్రం 5:26 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన ఎల్వీఎం 3 రాకెట్ కు 'బాహుబలి' అనే పేరు ఉంది. ఈ రాకెట్ సుమారు 4,400 కిలోల బరువున్న జీశాట్ 7ఆర్ ఉపగ్రహాన్ని జియో సింక్రనస్ బదిలీ కక్ష్యలోకి (విజయవంతంగా చేర్చింది. భారత్ గడ్డపై నుంచి ప్రయోగించిన కమ్యూనికేషన్ ఉప గ్రహాల లో ఇంత బరువైనది ఇదే మొదటిసారి. నిజానికి నాలుగు టన్నుల కంటే ఎక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి గతంలో విదేశీ సంస్థలపై ఆధారపడవలసి వచ్చేది. ఇప్పుడు ఎల్వీఎం 3 విజయం ద్వారా ఆ సాంకేతిక అవరోధాన్ని ఇస్రో పూర్తిగా తొలగించింది.

-చరిత్రలో తొలిసారి

ఈ మిషన్‌లో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాక, అంతకు మించిన ఒక ముఖ్య సాంకేతిక ప్రయోగం కూడా జరిగింది. జీశాట్ 7ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత, ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ లోని సీ25 క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ఇంజిన్‌ను అంతరిక్షంలో మళ్లీ మండించారు. ఈ సామర్థ్యం రాకెట్ కార్యాచరణ సౌలభ్యాన్ని అసాధారణంగా అసాధారణంగా పెంచుతుంది. భవిష్యత్తులో ఈ రాకెట్ ఒకేసారి అనేక ఉపగ్రహాలను వేర్వేరు కక్ష్యలలోకి ఖచ్చితంగా చేర్చడానికి, అలాగే గగన్‌యాన్ వంటి మానవ అంతరిక్ష యాత్రలకు అవసరమైన సంక్లిష్టమైన విన్యాసాలను నిర్వహించడానికి ఈ సాంకేతికత పునాదిగా నిలుస్తుంది. నిజానికి జీశాట్ 7ఆర్ ఉపగ్రహం భారత నావికాదళానికి ఒక వ్యూహాత్మక వరం. ఇది

2013 నుంచి సేవలందిస్తున్న పాత జీశాట్ 7 (రుక్మిణి) ఉపగ్రహం స్థానాన్ని భర్తీ చేస్తుంది. పూర్తిగా దేశీయంగా రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం, నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, తీర ప్రాంత కమాండ్ కేంద్రాల మధ్య నిరంతరాయంగా, సురక్షితమైన కమ్యూనికేషన్ అనుసంధానాన్ని అందిస్తుంది. ఇది వాయిస్, డేటా, మరియు రియల్‌టైమ్ వీడియోలను సైతం అత్యధిక వేగంతో పంపగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

అధునాతన రక్షణ కవచం - జామింగ్‌కు చెక్

శత్రు దేశాల నుండి వచ్చే ఎలక్ట్రానిక్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జీశాట్ 7ఆర్ అత్యాధునిక రక్షణ లక్షణాలను కలిగి ఉంది. జామింగ్‌ను నిరోధిస్తుంది. అటు ఫ్రీక్వెన్సీ హాపింగ్ సాంకేతికత ఉన్నాయి. యుద్ధ వాతావరణంలో నావికాదళ కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా, భద్రంగా ఉండేలా చూస్తాయి. ఈ ఉపగ్రహం యూహెచ్‌ఎఫ్, ఎస్సీ, కేయూ, కేఏ వంటి బహుళ బ్యాండ్‌లలో పనిచేస్తుంది. హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా పటిష్ట టెలికమ్యూనికేషన్ కవరేజీని అందిస్తుంది. నావికాదళం యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, గగనతల నిఘా పరికరాలన్నింటినీ ఒకే నెట్‌వర్క్‌లోకి తీసుకురాగలదు. కీలకమైన ఇండోపసిఫిక్ జలాల్లో నావికాదళం సమన్వయంతో కూడిన కార్యకలాపాలను వేగంగా నిర్వహించడానికి వీలవుతుంది. అందుకే ఈ ఉపగ్రహాన్ని నావికాదళానికి శక్తి గుణకం అని వ్యవహరిస్తున్నారు.

దేశ భద్రతలో స్వావలంబన వైపు ఒక అడుగు

రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సంక్లిష్టమైన భద్రతా సవాళ్ల మధ్య, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడాలనే భారత నావికాదళ సంకల్పాన్ని జీశాట్ 7ఆర్ ప్రతిబింబిస్తోంది. ఈ ఉపగ్రహం పూర్తిగా దేశీయంగా తయారవ్వడం, దేశీయ రాకెట్ ద్వారా ప్రయోగించడం వలన, అత్యవసర సమయాలలో విదేశీ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది భారత సార్వభౌమత్వానికి, భద్రతకు అత్యంత కీలకమైన అంశం.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

లేఖ

'దొంగతోగు' ఊరికి తొవ్వ కావాలి

రాష్ట్రంలో అతి చిన్న గ్రామ పంచాయతీ. మండలం ఆళ్లపల్లి. గుండాలకూ రాకపోకలు రహదారి లేక రగిలిపోతున్నా ఆదివాసీలు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

అభివృద్ధికీ ఆమడ దూరంలో 'దొంగతోగు' తోవ లేక ఆదివాసీల అవస్థలు. గుండాల మండలం దొంగతోగు గ్రామంలో సరైన రోడ్డు లేక ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీలో పలు రహదారులకు చాలా కాలం నుంచి నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో గోతులు ఏర్పడి ఛిద్రమయ్యాయి. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు వెళ్లే రహదారులు కొంతమేర బాగానే వున్నప్పటికీ, మండల కేంద్రాల నుంచి పంచాయతీలు, శివారు గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. కొన్నిచోట్ల తారు రోడ్లు ఆనవాళ్లు లేకుండా మట్టిరోడ్లుగా మారాయి. ఇక శివారు గ్రామాల రహదారుల పరిస్థితి వర్ణనాతీతం. గోతులు ఏర్పడి బురదమయం అయ్యాయి. ఆటోలు, అంబులెన్స్‌లు వెళ్లని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రధాన రహదారుల నుంచి శివారు గ్రామాలకు బురద మార్గాల్లో నడుచుకుంటూ రాకపోకలు సాగిస్తూ ఆదివాసీ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతుకులతో అత్యంత దారుణం

దొంగతోగు గ్రామం రహదారి గతుకులతో అత్యంత దారుణంగా మారింది. గుండాల మండలం కూ 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నా దొంగతోగు గ్రామానికి ఆదివాసీలు రాకపోకలు సాగిస్తుంటారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో వున్న ఈ రహదారికి యేండ్ల తరబడి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల బాగున్న రోడ్డుకన్నా గోతులే అధికంగా వున్నాయి. వర్షాకాలం కావడంతో గోతుల్లో నీరు నిలిచి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దొంగతోగు గ్రామం లో నివసిస్తున్న ప్రజలకు రోడ్డు మార్గం శాపంగా మారింది. సరైన రహదారి, వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో నిత్యం జలగండంతో బిక్కుబిక్కుమంటూ ఆదివాసీలు కాలం వెళ్లదీస్తున్నారు.

ఏజెన్సీ గ్రామాలకు దారేది?

వర్షాకాలం వచ్చిందంటే చాలు భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్నవాగులు దాటుకుంటూ వెళ్లాల్సిన దయనీయ స్థితిలో ఉన్నారు. గ్రామం నుంచి బయటకు వెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాలు వస్తే వరదలలో ఈదుకుంటూ వాగులలో మునుగుతూ స్వగ్రామానికి చేరుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదనను గ్రామస్తులు పదే పదే ప్రభుత్వ అధికారులకు గుర్తు చేస్తున్నప్పటికి పట్టించుకునేవారే కరువయ్యారు. పొట్టకూటి కోసం అత్యవసర పనుల నిమిత్తం పొరుగు గ్రామాలకు వెళ్లక తప్పని పరిస్థితి. ముత్తాపురం అవతల వైపున ఉండడంతో రేషన్ బియ్యం, నిత్యవసర సరుకులు, విద్య, వైద్యం, మండలం కార్యాలయం, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అవసరాలు ఉన్నపటికీ తీర్చుకునే దారి సులభంగా లేదు. దొంగ తోగు దట్టమైన అడవిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. దొంగతోగు గ్రామం ఆళ్లపల్లి మండల పరిధిలో ఉండటంతో ఆళ్లపల్లి మండలానికి అసలు రోడ్డు లేదు. దీనితో గుండాల మండలానికీ రాకపోకలు కొనసాగిస్తున్నారు. గుండాల రావడానికి కూడా సరైన రహదారి లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు దొంగతోగు రహదారి నిర్మాణం చేయాలని ఆదివాసీలు కోరుతున్నాను.

పూనెం రామకృష్ణ దొర
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, తెలంగాణ
9866073866

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

ప్రాంతీయం

రోడ్డు పనులు ప్రారంభించి.. త్వరగిత గతిన పూర్తిచేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్.

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 4 : హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు పనులను త్వరగా ప్రారంభించి త్వరితగిన పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఎం, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అప్ప జంక్షన్ నుండి మన్నెగూడ వరకు వెంటనే రోడ్డుపనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ... నిన్న జరిగిన ప్రమాదం అందరి హృదయాలను కలచి వేస్తోందని అన్నారు. బీజాపూర్ జాతీయ రహదారి పై పడిన గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్జిటిలో స్టే తొలగిపోయిందని ప్రకటించిందని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాధలు అయ్యారని ఆ పిల్లల సంరక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిందని అన్నారు మృతి చెందిన కుటుంబాలకు 25 లక్షల ఎక్స్గ్రేషన్ చెల్లించాలని గాయపడిన వారికి పది లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు స్పందించి అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు వెంటనే పూర్తి అయ్యేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో *సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీశ్, సిపిఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, అధ్యక్షుడు శ్రీనివాస్ సిఐటియు ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షులు రమేష్ ప్రధాన కార్యదర్శి నవాజ్ కోశాధికారి శ్రీశైలం ఉపాధ్యక్షులు వెంకట్రాములు మహేందర్ ఊరెళ్ళ రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారంగా

నష్టపరిహారం ఇవ్వాలి

- భూమి ధర 2,3 కోట్లు
- పరిహారం 8 లక్షలు
- పార్టీలకతీతంగా ఆందోళన
- సీపీఎం నేత నగేష్

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 4: ఉదయ సముద్రం ప్రాజెక్టు, కాలువ కింద వట్టిమర్తి గ్రామంలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధర ప్రకారంగా నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో సోమవారం ఆయన రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం చిట్యాల, నార్కట్పల్లి మండలాల పరిధిలో వట్టిమర్తి తో పాటు ఇతర గ్రామాల్లో త్రవ్వే కాలువల కింద భూములు కోల్పోయిన రైతులకు భూ సేకరణ చట్టం 2013 ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. 2, 3 కోట్ల ధర ఉన్న భూమికి 8 లక్షల నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటం విచారకరమని అన్నారు. రైతుల కోసం వట్టిమర్తి లో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఉన్నతాధికారులు హాజరు కాలేదని తెలిపారు. తగిన నష్టపరిహారం ప్రకటించకపోతే రాజకీయాలకు అతీతంగా సీపీఎం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపట్టవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో చిట్యాల మాజీ ఎంపీపీ జొర్రీగల శ్రీనివాసులు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహా, మండల నాయకులు చింతపల్లి క్రిష్ణయ్య, లడే రాములు, దూదిగామ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణకు గ్రామసభ

ఉదయ సముద్రం ప్రాజెక్టు కాలువల ద్వారా భూములు కోల్పోతున్న చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ రైతుల నుండి అభ్యంతరాలను స్వీకరించేందుకు అధికారులు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఎకరానికి రూ. 8 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇస్తామని అధికారులు చెప్పడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్కెట్ విలువ ప్రకారంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను తెలియపరుస్తూ రైతులు అధికారులకు వినతి పత్రాన్ని అందించారు.

రోడ్ విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలి

- మన్నెగూడ–హైదరాబాద్ రోడ్ విస్తరణకు డిమాండ్
- తాండూరులో నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి

ప్రతిపక్షం, తాండూరు, నవంబర్ 4 : మన్నెగూడ-హైదరాబాద్ రోడ్ విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తాండూరు పట్టణంలో సకలజనులతో కలిసి నిరసనలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైలట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ 2023 ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు విస్తరణకు అవసరమైన నిధులను మంజూరు చేసినప్పటికీ, ఎన్నికల అనంతరం కోర్టులో ఉన్న కేసులపై స్పందించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజల ప్రాణ భద్రతను పరిగణనలోకి తీసుకొని, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకొని మళ్లీ ఎలాంటి ప్రమాదాలు జరగకముందే రోడ్ విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని పైలెట్ రోహిత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,ప్రజలు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 4: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన ఉషన్నగారి హరీష్, భార్య ఉషన్నగారి రాజేశ్వరీతో కలిసి జీఎంర్ లో పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన తన తల్లి, అన్నతో భూమికి సంబందించిన డబ్బుల విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం అయ్యింది. అదేరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో హరీష్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంట్లోనుండి వెళ్లి మరలా ఇంటికి తిరిగిరాలేదు. తన భర్త ఫోన్ కు ఫోన్ చేసిన స్వీచ్ ఆఫ్ వస్తుందని తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు మొయినాబాద్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 4 : వాహనచోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని స్వామి నారాయణ గురుకుల్ పాఠశాల ముందు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు డ్రైవింగ్ లైసెన్ తీసుకోవాలని కోరారు. లైసెన్లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానాతో పాటు మూడు నెలల జైలు తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు,కానిస్టేబుల్ యాదగిరి, ఇమ్రాన్ ఉన్నారు.

ఆర్టీసీ పుణ్యక్షేత్రాల దర్శనం

సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 4 : తక్కువ ఖర్చుతో యాత్రికులు పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు ఆర్టీసీ కల్పించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి తెలిపారు. ఇవాళ రామచంద్ర పురంలోని ఆయన స్వగృహంలో ఆర్టీసీ హెచ్ సీయూ డిపో మేనేజర్ శ్రీనాథ్ గౌడ్, ఎండీ ఇసాక్, పటాన్ చెరు మేనేజర్ ఎండీ అక్బర్ తో పాటు పలువురు ఆర్టీసీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అందించే టూర్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే తక్కువ ఛార్జీతో సురక్షితంగా భక్తులు పుణ్యక్షేత్రాలను సందర్శించేలా ఆర్టీసీ చర్యలు తీసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. టూర్స్ ప్యాకేజీ ల మీద పెద్ద ఎత్తున్న ప్రచారం చేయాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం 'పుణ్యక్షేత్రాల దర్శనం' పేరిట ప్యాకేజీని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) మొదలుపెట్టిందన్నారు. ప్రైవేట్ బస్సులు, టూర్ ఆపరేటర్లతో పోల్చితే ఆర్టీసీ పుణ్యక్షేత్రాల దర్శనం ప్యాకేజీ ధరలు తక్కువగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఆయన సతీమణి సంగారెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు ఉన్నారు.

యువకుడు అదృశ్యం

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 4 : ఓ యువకుడు అదృశమైన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రం నుండి జీవనోపాధి కోసం గత నాలుగు నెలల క్రితం మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి షన్నుబేగం, రఫీక్ దంపతులు తన ముగ్గురు కుమారులు, ఓ కుమార్తెతో కుటుంబ సమేతంగా వలసవచ్చారు. పెద్ద కుమారుడు షకీల్ బాబా(25) కూలీ పనులు చేస్తూ కుటుంబంతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 2వ తేదిన ఇంట్లో పని ఉందని ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో నుండి బయటికి వెళ్లి మళ్లీ ఇంటికి తిరగిరాలేదు. దీంతో ఆందోలన చెందిన కుటుంబ సభ్యులు తన కుమారుడు రఫిక్ అదృశ్యమైయ్యాడని మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యాత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యాలు

- కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

ప్రతిపక్షం, ఉప్పల్, నవంబర్ 4 : సీసీ రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు అని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుక నగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ లో సుమారు 23 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్ పనులను జిహెచ్ఎంసి అధికారులతో కలిసి కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో దశలవారీగా సిసి రోడ్డు పనులను పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని డివిజన్ లో సుమారు 85% పనులు పూర్తయినాయని మిగిలిన పనులను కూడా సీవరేజ్ పైప్ లైన్ పనులు పూర్తి అయిన వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్కింగ్ స్పెక్టర్ కేదార్ , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల రెడ్డి ,కోకొండ జగన్ , మార్కా శీను, గణేష్ ,ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణ, శ్యామ్ , బంటి, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో

బస్తీ దవాఖానకు 4 అంబులెన్సులు

- మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ మేరకు అమలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 4 : కొల్లూరు డబల్ బెడ్ రూమ్ కాలనీ లో బస్తీ దవాఖాన వద్ద అత్యవసర వైద్య సేవలను మరింత బలోపేతం చేయడం కోసం నాలుగు అంబులెన్సులను, అంబులెన్స్ టెక్నిషియన్లతో కలిపి అందుబాటులో ఉంచినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ నాగ నిర్మల తెలిపారు. ఇటీవల కొల్లూరు డబుల్ బెడ్రూమ్ కాలనీలో జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇచ్చిన హామీ మేరకు ఈ అంబులెన్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం అండ్ హెచ్ఓ వివరించారు. ఈ నాలుగు అంబులెన్సుల్లో రెండు పటాన్చెరువు ఏరియా ఆసుపత్రి నుండి పంపించగా, ఒకటి 108 అంబులెన్స్ కాగా, మరొకటి మెదక్ ఎంపీ రఘునందన్ విరాళంగా అందించినదని తెలిపారు. అంబులెన్సుల మానిటరింగ్ బాధ్యతలను బస్తీ దవాఖాన వైద్య అధికారి డాక్టర్ అర్చనా రెడ్డికి అప్పగించినట్టు పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన సందర్భాల్లో బస్తీ దవాఖాన నుండి సమీప ప్రాంతాల ప్రజలకు సమయానుకూల చికిత్స అందించేందుకు ఈ అంబులెన్సులు కీలకంగా సహాయపడతాయని తెలిపారు.

10 చౌక ధరల దుకాణాల ప్రారంభం

కొల్లూరు డబుల్ బెడ్రూమ్ కాలనీల్లో 4 అంబులెన్సుల ఏర్పాటుతో పాటు 10 చౌక ధరల దుకాణాలను మంగళవారం ఆర్డిఓ రాజేందర్, డీసీ ఎన్ఎస్ఏ లక్ష్మీభవాని, డీఎం సివిల్ సప్లైస్ అంబాదాస్ రాజేశ్వర్లతో కలిసి ప్రారంభించారు. డబుల్ బెడ్రూమ్ కాలనీ ఫేస్-1లో రెండు చౌక ధరల దుకాణాలు, ఫేస్-2లో ఎనిమిది దుకాణాలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం సీఎస్సీ, డీసీఎస్ఓ, తహసీల్దార్ ఆర్సీపీయూ, డీసీ ఎన్ఎఫ్ఎస్ఏ, డీటీసీఎస్ తేజస్విని, హెడ్ ఆఫీస్ ఐటీ బృందం పాల్గొన్నారు.

రజకవృత్తిదారుల రక్షణ చట్టాన్ని తేవాలి

- చిట్యాలలో సంఘం మండల మహాసభ

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 4: రజక వృత్తిదారుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా చిట్యాల లో మంగళవారం జరిగిన రజక వృత్తిదారుల సంఘం మండల మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నేటికీ గ్రామాల్లో రజకులపై వివక్షత, దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్ష మంది రజక వృత్తిదారులు ఉన్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. నిధుల కొరతతో రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన మోడ్రన్ ధోబీఘాట్లను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐతరాజు యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకు పెద్దలు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆమనగంటి స్వామి, రుద్రారపు పెద్దులు, జిల్లా కమిటీ సభ్యులు ఆమనగంటి నరేష్, మండల నాయకులు అక్కెనపల్లి నాగయ్య, ఐతరాజు నర్సింహా, పాలమాకుల అర్జున్, గోలి మహేష్, మాజీ ఎంపీటీసీ మెంబర్ ఎద్దులపురి క్రిష్ణ, దామనూరి కనకయ్య, ఐతరాజు మాధవి సైదులు, అమరోజు రాములు, బాతరాజు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

“

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే స్పష్టమైన మెజారిటీ సాధిస్తుంది. 160కి పైగా స్థానాల్లో గెలుస్తాం. బీజేపీ, జేడీయూ సమాన సీట్లు సాధిస్తాయి. గత 11 ఏళ్లలో రోడ్లు, బ్రిడ్జిలు, పవర్ ప్లాంట్లు వంటి అతి ముఖ్యమైన మౌలిక సదుపాయాలను బలోపేతం చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తాం.
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ప్రాంతీయం





GOVERNMENT OF TELANGANA
ABSTRACT

HIGHER EDUCATION - Budget Estimates 2025-26 – Construction of First & Second floor over existing new block and Construction of new Hostel buildings for Boys & Girls at KDR Government Polytechnic, Wanaparthy - Administrative Sanction of Rs.1315.00 Lakhs - Orders - Issued.

HIGHER EDUCATION (TE) DEPARTMENT

G.O.Rt.No. 169 **Dated: 31-10-2025**
Read:-

From the Commissioner of Technical Education, Hyderabad Lr.No.CTE-SCHM/SCHM/28/2019,dt:18.03.202&14.08.2025.

*****

ORDER:-

In the reference read above, the Commissioner of Technical Education, Hyderabad has stated that the Principal (FAC), KDR Government Polytechnic, Wanaparthy, has submitted estimates for Rs. 1315.00 Lakhs prepared by Executive Engineer, TSEWIDC, Mahabubnagar for Construction of First & Second floor over existing new block and Construction of new Hostel buildings for Boys & Girls in KDR Government Polytechnic, Wanaparthy and requested the Commissioner of Technical Education, Hyderabad to arrange Administrative Sanction and sanction the budget for the above said works of the Polytechnic. Therefore, the CTE has requested to accord Administrative Sanction of Rs.1315.00 Lakhs (Rupees Thirteen Crores and Fifteen Lakhs only) under the Head of Account 4202-02-104-25-74-530-531 towards Construction of First & Second floor over existing new block and Construction of new Hostel buildings for Boys & Girls at KDR Government Polytechnic, Wanaparthy.

2. Government after examination of the proposal, here by accord administrative Sanction of Rs.1315.00 Lakhs (Rupees Thirteen Crores and Fifteen Lakhs only) towards Construction of First & Second floor over existing new block and Construction of new Hostel buildings for Boys & Girls at KDR Government Polytechnic, Wanaparthy under the Head of Account 4202-02-104-25-74-530-531.

3. The Commissioner of Technical Education, Telangana State, Hyderabad shall take necessary action accordingly.

4. This order issues with the concurrence of the Fin. (EBS.IV) Dept. vide U.O.Note.No.3270576/97/A2/EBS.IV/HE/2025, dt:09.09.2025.

వనపర్తి పాలిటెక్నిక్ వసతి గృహ నిర్మాణాలకు
రూ .13.15 కోట్ల నిధులు మంజూరు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4: విద్యాపర్తిగా పేరెన్నికగన్న వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ 13.15 కోట్ల నిధులు మంజూరు చేసింది.ఈ సందర్భంగా విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం. రేవంత్ రెడ్డి ఇప్పటికే విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలు పెంచి ఇవ్వడంతో పాటు, ప్రతి విద్యాలయానికి కావలసిన అన్ని రకాల సదుపాయాలను అందిస్తూ వస్తున్నారని ఎమ్మెల్యే. మేఘా రెడ్డి తెలిపారు.ఈ క్రమంలో వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల వెనక భాగంలో గల వసతి గృహానికి సంబంధించి బాలుర,బాలికల నూతన వసతి గృహాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు.ఈ నిధుల మంజూరు కి సహకరించిన సీఎం. రేవంత్ రెడ్డి,ఇంచార్జ మంత్రి. దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రి.జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ.మల్లు రవిలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తకు నివాళులర్పించిన నిరంజన్ రెడ్డి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4:హైదరాబాద్ జూబ్లీహిల్స్ రహేమాత్ నగర్ కు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త అజయ్ కుమార్ గుండె నొప్పితో మృతి చెందాడు.వెంటనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రి. సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం వారి స్వగృహానికి వెళ్లి భౌతికాయానికి పూలమాల వేసి,నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.మాజీ మంత్రి వెంట నాగం తిరుపతి రెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పోలీసులకు రివార్డులు అందించిన ఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 4: నారాయణపేట్ జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల సరఫరాపై గట్టి పర్యవేక్షణలో భాగంగా, ఇటీవల గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను జైలుకు పంపిన మక్తల్ సర్కిల్, టాస్క్ ఫోర్స్ పోలీసు అధికారులు సిబ్బందిని, మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ లు, పురుషోత్తం,ఎస్ యం నవీద్, హెచ్ సి గోప్యనాయక్, పీసీ లు రాఘవేందర్, రామస్వామి, అశోక్ కుమార్, శ్రీకాంత్, భానును జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందించి రివార్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు జిల్లాలో పూర్తిగా అరికట్టడం మా ప్రధాన లక్ష్యం అని గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి అని తెలిపారు. పోలీసులు కష్టపడి బాగా పని చేస్తే రివార్డులు అవే వస్తాయి అని అలాగే నిబద్ధతతో పనిచేయాలని, ప్రతి పోలీసు సభ్యుడు ప్రజల రక్షణకు కట్టుబడి ఉండి మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్ లు ఉన్నారు.

లైసెన్స్ సర్వేయర్లకు నెలవారీగా జీతం ఇవ్వాలి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, నవంబర్ 4: లైసెన్స్ డ్ సర్వేయర్లకు కమీషన్ పద్ధతి కాకుండా నెలవారీగా జీతాలు ఇవ్వాలని కోరుతూ నారాయణపేట జిల్లా అడిషనల్ రెవెన్యూ కలెక్టర్ శీనుకి ఎల్ఎల్ ఎస్ లైసెన్స్ జిల్లా సర్వేర్లు వినతి పత్రం అందించారు.అందుకు ఆయన సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం దృష్టికి పంపిస్తామని ఆడిషనల్ కలెక్టర్ శీను హామీ ఇచ్చారు. జిల్లా లైసెన్స్ సర్వేర్ల వారు శ్రీనివాసులు, ఆంజనేయులు, అబ్బాస్, చంద్రశేఖర్, మారుతి తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 4: ఈ నెల 6న మధ్యాహ్నం గం 1:00లకు ఎస్.ఆర్ .గార్డెన్ ఫంక్షన్ హాల్ నారాయణపేట, (పాత జిల్లా ఆసుపత్రి పక్కన) బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతుందనీ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పూజారులు,పాస్టర్స్, ఖ్వాజీలు మరియు జిల్లా లోని ఫంక్షన్ హాల్ యజమానులు,టెంట్ హౌస్ యజమానులు, సౌండ్ సిస్టమ్స్ మరియు డీజే నిర్వాహకులు క్యాటరింగ్ యజమానులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు మరియు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు అందరు కూడా ఈ అవగాహన కార్యక్రమంలో తప్పక పాల్గొనాలన్నారు.

అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని
ప్రియునితో కలిసి భర్తను హతమార్చిన భార్య

- నేరస్తులు చట్టం నుండి తప్పించుకోలేరు
- వనపర్తి జిల్లా ఎస్పీ.రావుల గిరిధర్

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4: నేరం చేసిన నేరస్తులు చట్టం నుండి తప్పించుకోలేరని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.మంగళవారం వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ రావుల గిరిధర్ మిస్సింగ్/ మర్డర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ లో బిజ్జి.చెన్నమ్మ తన సోదరుడు కేకుల కురుమూర్తి అక్టోబర్ 25నుండి కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డిఎస్పీ.వెంకటేశ్వరరావు నేతృత్వంలో సీఐ కృష్ణయ్య,టౌన్ ఎస్సై హరిప్రసాద్, చిన్నంబావి ఎస్సై.జగన్ మోహన్,వి.ఆర్ ఎస్ ఐ.రాము,టౌన్ సెకండ్ ఎస్సై శశిధర్ దర్యాప్తు ప్రారంభించారు.ఈ క్రమంలో భర్త తప్పిపోయాడని భార్య నాగమణి ఫిర్యాదు చేయాల్సింది పోయి నాగర్ కర్నూల్ లో నివాసం ఉంటున్న కురుమూర్తి సోదరి చెన్నమ్మ ఫిర్యాదు ఇవ్వడంపై పోలీసులకు అనుమానం కలగడంతో మిస్సింగ్ కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. కేకులమన్నెమ్మ (మృతుని భార్య) అదుపులో తీసుకొని విచారించగా,తమ అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంతో ప్రియుడు బుల్లెట్ శ్రీకాంత్ అలయాజ్ నందిమల్ల శ్రీకాంత్ తో కలిసి భర్త కురమూర్తిని టవల్తో బిగించి ఊపిరాడకుండా హత్యకు పాల్పడ్డారని నేరం ఒప్పుకుంది.నిందితులను ఇద్దరినిఅదుపులోతీసుకొని విచారించగా అక్టోబర్ 25 మధ్యాహ్నం తాము హత్య చేసి,వాహనంలో శ్రీశైలం ప్రాజెక్టు పవర్ సమీపంలో కృష్ణ నీటిలో మృతదేహాన్ని పడేసామని ఒప్పుకున్నారు.అక్టోబర్ 2వతేది శ్రీశైలం కాలువ నీటిలో మత్స్యకారుల వలలకు గుర్తు తెలియని మృతదేహం చిక్కిందన్న సమాచారం అందించారు.దర్యాప్తు బృందం సంఘటన స్థలం చేరుకొని, కుటుంబ సభ్యులు తెలిపిన ఆనవాళ్ళ ప్రకారం ఆ మృతదేహం కేకుల కురుమూర్తిగా గుర్తించారు.నేరం ఒప్పుకున్నా వనపర్తి పట్టణానికి చెందిన నిందితులు మృతుడి భార్య కేకుల నాగమణి,ప్రియుడు నందిమల్ల శ్రీకాంత్ ను రిమాండ్ కు తరలించామని ఎస్పీ గిరిధర్ తెలిపారు.మర్డర్ కేసును చేదించిన ధర్యాప్తు బృందం అధికారులను,కానిస్టేబుల్ నవీన్ కుమార్ గౌడ్,శివాలను ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

వివాహిత మిస్సింగ్..
కేసు నమోదు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 4: చిట్యాల మండలం వెలిమినేడు కు చెందిన మంకాల రేణుక (35) జాడ దొరకడం లేదని భర్త మంకాల బుచ్చయ్య మంగళవారం చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. అక్టోబర్ 31న సాయంత్రం ఇంటి నుండి వెళ్లిపోయిందని, ఎక్కడ వెతికినా జాడ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువత ఉద్యోగం కోసం కాదు
ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- చంద్రశేఖర్,అదనపు కలెక్టర్
- కలెక్టరేట్లో ఘనంగా యువజన ఉత్సవాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 4 : విద్యార్థులు, యువత మంచి ఉద్యోగాలు సాధించాలన్న ఏకైక లక్ష్యంతో పని చేస్తున్నారని శ్రమిస్తున్నారని ఉద్యోగాల సాధనకు కాదు ఉద్యోగాల కల్పన కోసం శ్రమించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా యువజన సంక్షేమ క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్లో జరిగిన జిల్లా యువజన ఉత్సవాలు, సైన్స్ ఫెయిర్ 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తి ని భవిష్యత్తు తరాలకు అందజేయడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు, యువత సంక్షేమం కోసం అనేక రకాల కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విద్యార్థులు,యువత లో చైతన్యం నింపేందుకు కోసం యువజన ఉత్సవాలలో భాగంయువజన ఉత్సవాలలో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, కవిత పోటీలు నిర్వహించడం ఇట్టి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కవిత్వానికి, నాట్యానికి కలలకు మనిషిని కదిలించే శక్తి ఉంటుందన్నారు. యువజనోత్సవాల్లో భాగంగా వివిధ కళా పోటీలతోపాటు సైన్స్ ఫెయిర్ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ఉన్నత స్థాయికి ఎదిగేలా చేయడం కోసం ప్రభుత్వం యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి మొహమ్మద్ ఖాసిం, రాష్ట్ర యువజన సంఘాల నాయకుడు కూన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి

- డీఆర్ఓ పద్మజారాణి
- కమిటీలు నామమాత్రంగా కాకుండా బాధ్యతగా పనిచేయాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 4 : జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, వినియోగం నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన మత్తు పదార్థాల నియంత్రణ చర్యల సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రఘునందన్, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఆరోగ్య, విద్య, పోలీసు, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు, అలాగే కళాశాలలు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, వినియోగం పరిస్థితులు, వాటి ప్రభావం, నియంత్రణ చర్యలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణా, వినియోగం పెను సవాలుగా మారిందని అన్నారు . కమిటీలు నామమాత్రం గా కాకుండా బాధ్యతగా పనిచేయాలని అన్నారు .యువత, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు రవాణా, వినియోగం జరుగకుండా అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. యువతలో డ్రగ్ వ్యసనం పెరగకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యసన నిర్మూలన కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖతో పాటు ఆరోగ్య శాఖ సంయుక్తంగా కౌన్సెలింగ్ సెంటర్లు, రీహాబిలిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, పోలీసు విభాగం అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. సమాజానికి పెను ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించేందుకు విస్తృతస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రహారీ క్లబ్ లను ఏర్పాటు చేయడమే కాకుండా, అవి సమర్థవంతంగా పని చేసేలా చూడాలన్నారు. సమావేశంలో డి ఈ ఓ వెంకటేశ్వర్లు , ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత నిధులనే తాను తెచ్చినట్లు ప్రగల్భాలు

- పాలిటెక్నిక్ నిధులపై అబద్ధాలు చెబుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి
- జిల్లా మీడియా కన్వీనర్.నందిమల్ల అశోక్

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4: వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ,వసతి గృహాల పునర్నిర్మాణం కోసం కోసం మాజి మంత్రి. సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిధులు మంజూరు చేస్తే... అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వనపర్తి ఎమ్మెల్యే. మేఘా రెడ్డి జిఓ నంబర్స్ మారిస్తే అభివృద్ధి మీ ఖాతాలో పడుతుందా? అని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ ప్రశ్నించారు.ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ, వసతి గృహాల పునర్నిర్మాణం కోసం గతంలో మాజి మంత్రి. నిరంజన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ కోసం రూ.13కోట్ల 40లక్షలు,బాలుర వసతి గృహాల పునర్నిర్మాణం కోసం రూ.4కోట్ల 30లక్షలు,బాలికల వసతి గృహాల పునర్నిర్మాణం కోసం రూ.4కోట్ల 30లక్షలు మొత్తం అన్నింటికీ కలిపి రూ.22కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఎన్నోసార్లు పత్రికల ద్వారా ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. కానీ వనపర్తి ఎమ్మెల్యే.మేఘారెడ్డి గతంలో పాలిటెక్నిక్ అభివృద్ధి కోసం తామే రూ.22కోట్లు నిధులు మంజూరు చేశామని ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.వనపర్తి నిధులపై బిఆర్ఎస్ పార్టీగా ఎన్నోసార్లు ఖండించిన రోజుకో కొత్త జిఓ పేరిట ప్రజలను మభ్యపెట్టడం మంచిది కాదని హితవు పలికారు.గతంలో ఆ నిధులు లేవని మళ్ళీ కొత్త జిఓ ద్వారా రూ.22కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పిన ఎమ్మెల్యే. మేఘా రెడ్డి నేడు పాలిటెక్నిక్ వసతి గృహాలకు రూ.13కోట్ల 15లక్షలు నిధులు మంజూరు అని ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని నందిమల్ల అశోక్ అన్నారు.రెండేండ్లుగా మీరు చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, మాజి మంత్రి.నిరంజన్ రెడ్డి మంజూరు చేయించిన నిధుల్ని తాము తెచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే కొత్త అభివృద్ధి పనులు మంజూరు చేయించి తన ప్రతిష్టను పెంచుకోవాలి కానీ గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తమ అభివృద్ధి అని చెప్పుకోవడం మానుకోవాలని అన్నారు.

మీర్జాగూడ బస్సు ప్రమాదానికి టిప్పర్ అతివేగమే కారణం. ఇక్కడ రోడ్డు మలుపు ఉంది కానీ యాక్సిడెంట్ అయ్యేంత తీవ్ర మలుపు లేదు. దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయి. టిప్పర్ కండిషన్‌ను పరిశీలిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదు. అందరి బాధ్యతగా చూడాలి. డ్రైవర్లు డిఫెన్స్ కండిషన్‌ను అంచనా వేసుకోవాలి.

\- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

ప్రాంతీయం

ఇచ్చిన హామీలు తీర్చకుంటే పోరుబాట

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి
- వంగ మహేందర్ రెడ్డి అభినందన సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 4: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పోరుబాట తప్పదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన వంగ మహేందర్ రెడ్డి అభినందన సభ సోమవారం రాత్రి సిద్దిపేటలోని పీఆర్టీయూ భవన్లో జరిగింది. సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పింగళి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయులకు నిరంతరం సేవ చేస్తున్న యువ నాయకుడు వంగ మహేందర్ రెడ్డి సేవలు పీఆర్టీయూటీఎస్ సంఘానికి ఉపయోగించుకోవడానికి అధికార ప్రతినిధిగా నియమించినట్లు తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంగ మహేందర్ రెడ్డి ఓటమి పాలైనప్పటికీ ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిరంతరం ఉపాధ్యాయులకు పాఠశాలలకు సేవలందించడం అభినందనీయమని తెలిపారు. గత ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుల పెండింగ్ డీ ఏ లు మూడు నెలల్లోపు చెల్లిస్తామని, సీ పీ ఎస్ రద్దు చేస్తామని, హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని, నెలలోపు అన్ని హామీలు నెరవేరుస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని రెండు సంవత్సరాలు వేచి చూశామని చెప్పారు. డిసెంబర్ 9 లోపు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు.

పీఆర్టీయూకు ప్రాథమిక సభ్యులే అధిష్టానం

శాసనమండలిలో 40 మంది ఎమ్మెల్సీలలో 39 మంది ఎమ్మెల్సీలు వివిధ పార్టీలకు చెందిన వారేనని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీలు కూడా పార్టీల కండువాలు కప్పుకొని ఉపాధ్యాయుల గొంతుకను వినిపించలేని దుస్థితి నెలకొందన్నారు. ఉపాధ్యాయుల పక్షాన తాను నిలబడుతున్నానని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలే తన ఎజెండా అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను రక్షించడమే తన ఏకైక లక్ష్యమని శ్రీపాల్ రెడ్డి ప్రకటించారు. నిజాయితీతో ఉపాధ్యాయులకు సేవ చేయాలని ఆలోచనలు వంగ మహేందర్ రెడ్డిని భవిష్యత్తులో శాసనమండలి సభ్యునిగా ఎన్నుకోవాలని శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. వంగ మహేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ సిద్దిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అదరాసు పల్లి శశిధర శర్మ, రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పత్రిక సంపాదక వర్గ సభ్యురాలు లక్కిరెడ్డి విజయ, సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ నీరడి లక్ష్మీనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పదార్థాలు వాడకూడదు

- జిల్లా కలెక్టర్ కె హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 4: కాలం చెల్లిన పదార్థాలు వాడకూడదని జిల్లా కలెక్టర్ హైమవతి అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని బాలసదనంను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి రాత్రి వేళ అందించే బోజన ప్రక్రియను పరిశీలించారు. వంట గదికి వెళ్లి ఆహార పదార్థాలు తనిఖీ చేశారు. అన్నం, చికెన్, రసం, పెరుగు వండినట్లుగా వంట సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. రోజు మెనూ ప్రకారమే టిఫిన్, లంచ్, స్నాక్స్, డిన్నర్ చెయ్యాలని పాలు పండ్లు తప్పకుండా పౌష్టికాహారం అందివ్వాలని పిల్లలకు పెట్టాలని తెలిపారు. బియ్యం, పప్పులు, పలు సామగ్రిని తనిఖీ చేశారు. కాలం చెల్లిన పదార్థాలు వాడకూడదని తెలిపారు. వార్డెన్ బదిలీపై వెళ్లిందని తెలపగా కొత్త వార్డెన్ వచ్చేవరకు మెనూ ప్రకారం వంట సరుకులు, కూరగాయలు అందివ్వాలని డీడబ్ల్యుఓ శారదను ఆదేశించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 4: చేగుంట మండల కేంద్రానికి చెందిన తిరుపతి కృష్ణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆ కుటుంబానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బిక్షపతి, చేగుంట మండల అధ్యక్షుడు బెదరబోయిన నాగభూషణం, కాశబోయిన పెద్ద భాస్కర్, మద్ది లక్ష్మీనరసయ్య, తలారి లింగం తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్లు పైబడిన వాకి పరీక్షలు నిర్వహించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్
- తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 4: 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డా. సిహెచ్. ధనరాజ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం బెజ్జంకి మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశానికి హాజరై, వారు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు, అనంతరం ల్యాబ్, ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు, తీవ్రమైన రక్తహీనతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలు, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చికిత్స అందించాలని, గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాలని, కీటక జనిత వ్యాధుల పైన ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధరణ ప్రసవాల సంఖ్య పెంచాలని అన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట డాక్టర్ కృష్ణ తేజ, డీపీఎంఓ రవీందర్, హెచ్ఈఓ శ్రీనివాస్, హెచ్ఎస్ విజయ, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్(నర్సాపూర్), నవంబర్ 4:- విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆశ్రమ పాఠశాల కౌడిపల్లి ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు,విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని. విద్యార్థులకు మాసహారం ,చికెన్ పెట్టడం లేదని చెప్పారని, ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాలుగా నాణ్యమయిన బోజనానికి కట్టుబడి ఉందన్నారు.ప్రతి విద్యార్థికి ఆహారం తినే హక్కు రాజ్యాంగం కల్పించిందని, విద్యార్థులను నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు.ఫుడ్ కమిషన్ చైర్మన్,సభ్యుల వెంట డి ఈ ఓ రాధకిషన్, బి డబ్ల్యు ఓ హేమ భార్గవి, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్ రెడ్డి, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు,తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హరీశ్ రావును పరామర్శించిన ఆటో యూనియన్ నాయకులు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 4: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావును హైదరాబాద్ లోని ఆయన నివాసంలో నంగునూర్ మండలంలోని రాంపూర్, మగ్దూంపూర్ గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు, సభ్యులు పరామర్శించారు. హరీశ్ రావు తండ్రి సత్యనారాయణ రావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు బట్ట నర్సయ్య,నాయకులు చిట్యాల సురేష్, పాకాల శ్రీనివాస్, పాకాల బాబు, రాగుల రామకృష్ణ, మంగ మహేందర్, గోషికొండ భాస్కర్, వరిగంటి మల్లేశం, మోటం రాజు, ముత్యాల కర్ణాకర్, బొల్లు శ్రీశైలం, వాస్పరి అశోక్, పి శ్రీనివాస్, ఎనగందుల నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ కీలకం

- డీఐఈఓ రవీందర్ రెడ్డి
- జూనియర్ కళాశాలల్లో ముమ్మర తనిఖీలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 4: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ అత్యంత ముఖ్యమైన దశ అని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా ప్రత్యేక అధికారి, మేడ్చల్ డీఐఈఓ కిషన్ తో కలిసి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ప్రభుత్వ రంగ జూనియర్ కళాశాలలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ తనిఖీలు ఈనెల 15 వరకు కొనసాగుతాయని, ప్రిన్సిపల్ అధ్యాపకులు సమయపాలన, బోధనలో మెలకువలను పాటిస్తూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కళాశాలలో వసతులు, ఎఫ్ ఆర్ ఎస్, యుడైస్, టీచింగ్ డైరీలు, కళాశాల రికార్డులు అధ్యాపకుల హాజరు, తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. అన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు అయ్యాయని, హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధ్యాపకులు గడువులోగా సిలబస్ పూర్తి చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. కళాశాలకు హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కాగా డీఐఓ రవీందర్ రెడ్డి గజ్వేల్ లోని కళాశాలలు తనిఖీ చేయగా, ప్రత్యేక అధికారి కిషన్ పట్టణంలోని పలు ప్రైవేట్ ,మైనార్టీ, రెసిడెన్షియల్ కళాశాలలను తనిఖీ చేసి పలు సూచనలు సలహాలు అందించారు.

బీఎల్పీలో పలువురి చేరిక

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 4: బహుజన లెఫ్ట్ పార్టీలో సిద్దిపేట పట్టణానికి చెందిన పలువురు చేరినట్లు బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోటగిరి ఆంజనేయులు, మహిళ సంఘం కన్వీనర్ కొండ వర్ష తెలిపారు. సిద్దిపేట పట్టణానికి చెందిన లింగవ్వ, ర్యాకం మహేష్, దబ్బేట భగవాన్లు పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్క్సిజం, అంబేడ్కరిజం ఆలోచనా విధానంతో కూడిన రాజకియ కార్యక్రమం ద్వారా తెలంగాణలో బహుజన శ్రామిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ రాజ్యాధికారం లక్ష్యంగా పని చేస్తున్న పార్టీ బహుజన లెఫ్ట్ పార్టీ అని అన్నారు. సిద్దిపేట జిల్లాలో పార్టీ, ప్రజా సంఘాల బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దబ్బెట ఆనంద్, సన్నీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావును పరామర్శించిన బీఆర్ఎస్వీ నాయకులు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 4: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును హైదరాబాదులోని వారి నివాసంలో నంగునూరు మండల పరిధిలోని అక్కెనపల్లి గ్రామ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతరాజు రమేష్, గోనెపల్లి యాదగిరి, జగ్గని బాబు, తిప్పని నరేష్, నాగారపు కృష్ణ, తిప్పని ప్రవీణ్, కడవేర్గు శివ, శ్రీమంతుల వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పరామర్శ

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావును సిద్దిపేట వీడియో, ఫొటో జర్నలిస్టులు వెంకటేష్, ప్రవీణ్, నవీన్, చంద్రమౌళి, నరేష్, వెంకటేష్, చిన్న, బాబూరావు, శ్రవణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులర్పించారు.

రామంచ ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

- మండల విద్యాధికారి తిరుపతి
- విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 4: పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రామంచ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయం అని చిన్నకోడూరు మండల విద్యాశాఖ అధికారి తిరుపతి అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. చిన్నకోడూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఎంఈఓ తిరుపతి విద్యార్థులకు రూ.18 వేల విలువ చేసే క్రీడా దుస్తులను 40 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తిరుపతి మాట్లాడుతూ రామంచ పాఠశాల విద్యార్థుల సంఖ్య పరంగా మండలంలో మూడవ స్థానంలో ఉందని తెలిపారు. పాఠశాలలో విద్యతో పాటు, ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారన్నారు. పాఠశాలకు తల్లిదండ్రుల సహకారం బాగుందన్నారు. పిల్లలను ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే విధంగా మంచి విద్యను అందించాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందిస్తున్న చేయూతను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు యాంసాని వెంకట సురేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం అబ్దుల్లా షరీఫ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ప్రేమలత, ఉపాధ్యాయులు సునీత, నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



"

ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు 91.7% పూర్తయ్యాయి. నిర్ణీత గడువుకు ముందే పనులను పూర్తి చేయాలని నిశ్చయంతో ఉన్నాం. డిసెంబర్ ఆఖరు లేదా జనవరి తొలి వారంలో టెస్ట్ ఫ్లైట్ ఎగరనుంది. ఏవియేషన్ వర్సిటీ, ఇండిగో హబ్ ఏర్పాటుకు యత్నిస్తున్నాం. భోగాపురంలో స్కిల్ వర్సిటీలు నిర్మిస్తాం.

- కేంద్ర మంత్రి రామ్మోహన్

ప్రాంతీయం

తడిసిన దాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 4 : అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి మొలకలు రావడానికి పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. నంగునూరు మండలంలోని అక్కెనపల్లి, ఖాతా మంగ వారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని బీఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, రంగు రాజు గౌడ్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పై కాంగ్రెస్ ప్రభుత్వం సవితి ప్రేమ చూపిస్తోందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లను ప్రారంభిచడంలో ఆలస్యం చేయడం వల్ల రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సిన పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే బాధ్యత వహించి కొనుగోలు చేయాలని, 1 పంట ఎకరానికి రూ.25 వేలకు తగ్గకుండా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ దశమంత రెడ్డి పాలెపు నరసింహులు గౌడ్ ఆరేపల్లి రాజు ఉల్లి చిన్న మల్లయ్య, చెలికాని మల్లేశం, దేవులపల్లి కనకయ్య పాల్గొన్నారు.

మణిపూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

- ప్రపంచంలో ఎత్తయిన రైల్వే బ్రిడ్జిని సందర్శించిన బండి సంజయ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 4: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే బ్రిడ్జిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సందర్శించారు. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్ నగరాన్ని అస్సాం ద్వారా భారత రైల్వే నెట్ వర్క్‌తో అనుసంధానం చేసే జిరిబామ్-ఇంఫాల్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులో ఈ రైల్వే బ్రిడ్జి ఒకటి. 703 మీటర్ల పొడవున 7 పిల్లర్లతో ఈ వంతెనను నిర్మిస్తున్నారు. ఇందులో 2 పిల్లర్లు 141 మీటర్ల ఎత్తు కలిగి ఉండటం ప్రపంచ రికార్డు అని మణిపూర్ అధికారులు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి ఈ రైల్వే లేన్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని ఆద్యంతం పరిశీలించారు. నిర్ణీత సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కష్టపడుతున్న అధికారులను, ఇంజనీరింగ్ సిబ్బందిని కేంద్ర మంత్రి అభినందించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాక మణిపూర్ రాష్ట్రం భారత రైల్వే పటంలో స్థిరమైన చోటు సంపాదిస్తుందనే నమ్మకాన్ని బండి సంజయ్ వ్యక్తం చేశారు. అంతకుముందు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉదయం నోనె జిల్లాకు చేరుకుని జిల్లాలో అమలవుతున్న కేంద్ర సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమీక్షించారు. కలెక్టర్ శరత్ చంద్ర, జిల్లా ఎస్పీతోపాటు తమెంగ్‌లాంగ్ జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఈ సమీక్షా సమావేశంలో పాల్గొని పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను, అవరోధాలను కేంద్ర మంత్రి ద్రుష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపాదనలు రూపొందించి పంపాలని, కేంద్ర పెద్దలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

ఏడుపాయల, మెదక్‌చర్చ్‌ని సందర్శించిన ఫుడ్ కమిషన్ చైర్మన్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 4:- తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయాన్ని మంగళవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు సందర్శించారు. వేద పండితులు వారికి పూర్ణకుంభముతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి పూలమాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్. నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసాచారి తదితరులు ఉన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చిని కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి సభ్యులు చర్చిని సందర్శించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కన్నుల పండుగగా లక్ష దీపోత్సవం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 4: శ్రీ ఉమాపార్థివ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక లక్ష దీపోత్సవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసం భక్తి, ఆధ్యాత్మికత, ఐకమత్యానికి ప్రతీక అని అన్నారు. ఈ పవిత్రమైన నెలలో ప్రతి ఒక్కరూ సత్సంకల్పంతో దీపాలను వెలిగించి సమాజంలో సానుకూలతను వ్యాప్తి చేయాలి అని చెప్పారు. కార్యక్రమ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొని దీపోత్సవాన్ని విజయవంతం చేశారు.

జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తేవాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 4:- విద్యార్థులు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకొని, అందుకు తగిన విధంగా రాణించి జాతీయస్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని సాయి అవుట్డోర్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ అలవాటు చేసుకోవడం వల్ల భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చని సూచించారు. ఇటీవల క్రికెట్లో ప్రపంచకప్ సాధించిన మహిళలను ఆదర్శంగా తీసుకొని రాణించాలన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు టీవీలకు సెల్ఫోన్లకే అలవాటు పడ్డారని, తద్వారా శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా సెల్ఫోన్ వదిలి పుస్తకాలతో పాటు మైదానాల బాట పట్టాలని విద్యార్థులకు సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల్లో నెలకొన్న నైపుణ్యాలను గుర్తించి, వాలు ఆ అంశంలో రాణించేలా కృషి చేయాలని తెలిపారు. త్వరలో పార్లమెంట్ స్థాయి క్రీడలను సైతం 45 రోజుల పాటు నిర్వహించనున్న మన్నారు. ఇందులో మండల స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, క్రీడల అధికారి రమేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, పీఈటీలు, పీడీలు, వివిధ పాఠశాకు చెందిన విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ అప్లికేషన్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 4: సర్వే శాఖలో పెండింగ్ అప్లికేషన్లు డిసెంబర్ లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమవతి ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా, మండల సర్వే ల్యాండ్ శాఖ సంబంధించిన కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్ కె హైమావతి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతీ అప్లికేషన్లు డిస్పోజల్లో సర్వే అధికారుల పాత్ర కీలకం అని తెలిపారు. గత కొంత కాలంగా పెండింగ్ పిటిషన్లు ఒక ప్రణాళిక ప్రకారం ఫీల్డ్ వెరిఫై చేసి యుద్ధ ప్రాతిపదకన డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. ప్రతి నెల మండల సర్వేయర్లు ఆయా తహసిల్దార్ కి టూర్ డైరీ లు సమర్పించాలని తెలిపారు. గతంలోని జిల్లాకు సంబంధించిన సర్వే రికార్డులు అన్ని సేకరించుకుని భద్రపరచుకోవాలని సర్వేల్యాండ్ ఏడి వినయ్ కుమార్ ను ఆదేశించారు. సర్వే శాఖపైన ఉన్న అపోహలు అన్ని తొలగిస్తూ శ్రద్ధగా విధులు సక్రమంగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హరీష్ రావును పరామర్శించిన రెడ్డి సంఘం సభ్యులు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబరు 4 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నిరూ హరీష్ రావును హైదరాబాదులోని వారి నివాసంలో సిద్దిపేట ప్రశాంత్ నగర్ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పరమర్శించారు. ఈ సందర్భంగా వారి తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ రెడ్డి సంఘం అధ్యక్షులు పేరడీ వెంకట్ రెడ్డి, నాయకులు గన్నె రాజు రెడ్డి, బాల్ రెడ్డి, మారెడ్డి మల్లికార్జున్ రెడ్డి, లింగాల రాజలింగారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రాయవరం రవీందర్ రెడ్డి, వట్టిపల్లి రాజిరెడ్డి, అలాగే రైతు సంఘం నాయకులు పాతూరి వెంకట్ రెడ్డి (మందపల్లి), చంద్రారెడ్డి నరసింహారెడ్డి, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 4: ఈ నెల 15న మెదక్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక లోక్ ఆదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్లో గల కేసులను త్వరితగతిన పరిష్కారమయ్యేలా న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరిస్తేనే బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు. చిన్న చిన్న వివాదాలపై న్యాయస్థానాల చుట్టూ తిరగడం కంటే పరస్పర అవగాహనతో రాజీ పడటం సమాజానికి మేలు చేస్తుందని, అట్టి కేసులను పరిష్కారమయ్యే దిశంగా తీసుకెళ్లేందుకు పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. క్రిమినల్ కేసుల్లో నిందుతులపై తగిన ఆధారాలతో శిక్షలు పడేలా చర్యలు తీసుకొవాలన్నారు. కేసుల పరిష్కారంలో ఏవైన సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్లో గల కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ, రాజీ పడే కేసులను గుర్తించి ప్రత్యేక లోక్ ఆదాలత్లో పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్ గౌడ్, సీఐలు వెంకటరాజు గౌడ్, రేణుకరెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, జార్జ్, మహేశ్, రాజశేకర్ రెడ్డి, జిల్లా ఎస్ఎచ్వోలు, కోర్టు డ్యూటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావును పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 4: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నిరూ హరీష్ రావును హైదరాబాదులోని వారి నివాసంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ఇంచార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, నాయకులు మల్లిగారి యాదగిరి మాదిగ, ముక్క పల్లి రాజు మాదిగ, స్రామాట్ ప్రకాష్, పెన్నింటి శ్రీహరి సింధు, దొమ్మాట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్రెడ్డిపల్లిలో మెగా పశు వైద్య శిబిరం

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 4: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని గుండ్రెడ్డిపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్‌సెక్రెటరీ ధ్యాన లింగమూర్తి స్వయం కృషితో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ సంజయ్ గుప్తా పాల్గొని మాట్లాడారు. లింగమూర్తి సొంత డబ్బులు వెచ్చించి పశు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయం అన్నారు. మూగజీవులకు సేవలు అందించే ఇలాంటి సేవా కార్యక్రమాలను లయన్స్‌క్లబ్ ముందుకు తీసుకెళ్లవలసిన అవసరం ఉందని సంజయ్ గుప్తా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చేగుంట లయన్స్ క్లబ్ అధ్యక్షులు శంభుని శ్రీనివాస్, సెక్రెటరీ పులబోయిన నాగరాజు, జానకి రాములు, బుడ్డ భాగ్యరాజ్, ఆకుల సుఖేందర్, బుర్కా నాగరాజు, వీరబ్రహ్మం, రామచంద్రం, సంజీవ్, రవికుమార్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేద వర్గాలకు ఎర్ర జెండానే భరోసా

- ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తాం.
- సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 4: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 100 ఏళ్ల ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తామని, ప్రభుత్వాలు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలలో అర్హులకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రశ్నిస్తూనే ఉంటామని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మంగళవారం రోజున సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్థానిక ఎడ్ల గురువారెడ్డి భవన్ లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అధ్యక్షతన జరిగిన సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ, కౌన్సిల్, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సీపీఐ అని అన్నారు. డిసెంబర్ 26 న ఈ దేశంలో సీపీఐ పార్టీ 100 యేళ్లు పూర్తి చేసుకోబోతుందని, ఈ ఎర్రజెండా మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో, పట్టణంలో సీపీఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉందామని, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 26న సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో 10 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఆ సభ విజయవంతం కోసం జిల్లా నుండి కార్యకర్తలను తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, అందే అశోక్, కొమ్ముల భాస్కర్, కిష్టపురం లక్ష్మణ్, యెడల వనేశ్, జేరిపోతుల జనార్దన్, పిల్లి రజిని, జిల్లా కౌన్సిల్ సభ్యులు గజాభీమకర్ బన్సీలాల్, వేల్పుల శ్రీనివాస్, శివలింగ కృష్ణ, మిట్టపల్లి సుధాకర్, ఆది రంగారెడ్డి, రామగళ్ల నరేష్, సంగెం మధు, బొజ్జపురి రాజు, స్వర్గం రాజేశం, ముంజ గోపి, కత్తుల భాస్కర్ రెడ్డి, ఎస్కె హారిఫ్, బందారు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

“

గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి కేంద్రం 'సాస్కి' పథకం ద్వారా సమకూర్చిన రూ.2 వేల కోట్ల నిధులను సద్వినియోగం చేసుకోవాలి. రహదారుల నాణ్యతలో రాజీపడొద్దు. అధికార యంత్రాంగానిదే బాధ్యత. ప్రమాణాలకు తగ్గట్లు నిర్మిస్తున్నారో లేదో తనిఖీ చేయాలి. నేను, నిపుణులు క్షేత్రస్థాయిలో క్వాలిటీ చెక్ చేస్తాం. రోడ్ల విషయంలో గత ప్రభుత్వం అలక్ష్యంతో వ్యవహరించింది.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ప్రాంతీయం

పాఠశాలల నిర్వహణ మెరుగుపడాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- విద్యాశాఖ పనితీరుపై సమీక్ష

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 4 : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు మరింతగా మెరుగుపడేలా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం అన్ని మండలాల ఎం.ఈ.ఓలతో విద్యా శాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని అన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను బోధిస్తూ, ఫలితాలు గణనీయంగా మెరుగుపడేలా చూడాలన్నారు. ప్రత్యేకించి పదవ తరగతిలో ఉత్తీర్ణత మెరుగుపడాలన్నారు. పాఠశాలల్లో మంజూరయ్యే అభివృద్ధి, మరమ్మతు పనులకు సంబంధించిన పూర్తి వివరాలు ఎం.ఈ.ఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలిసి ఉండాలని అన్నారు. అప్పుడే వారు ఆ పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడగల్గుతారని కలెక్టర్ అన్నారు. ఏయే పనులకు ఎన్ని నిధులు కేటాయించబడ్డాయి, పనులు చేపట్టాల్సిన ఏజెన్సీ గురించి వివరాలు సేకరించి పనులు సకాలంలో చేపట్టేలా చొరవ చూపాలన్నారు. మధ్యాహ్న భోజనం అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా, విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. యూడైస్ లో వివరాలను నమోదు చేయడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ పద్ధతిన శత శాతం అమలు చేయాలని సూచించారు. లైబ్రరీ, కిచెన్ గార్డెన్ వంటి వాటిని ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. మిషన్ భగీరథ జలాలు ప్రతి బడికి అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ సదుపాయం, కంప్యూటర్ల మరమ్మతులు వంటి అంశాలపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఉద్దేశించిన భవిత కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేస్తూ, నాణ్యమైన విద్యా బోధన అందించేలా కృషిచేయాలన్నారు. ఎక్కడైనా లోపాలు నెలకొని ఉంటే, వాటిని సవరించుకుని జిల్లాలోని అన్ని పాఠశాలల నిర్వహణ మెరుగుపడేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీ.ఐ.ఈ.ఓ రవికుమార్, డీ.ఈ.ఓ అశోక్, అన్ని మండలాల ఎం.ఈ.ఓలు, కాంప్లెక్స్ పాఠశాలల హెచ్.ఎంలు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్ ...

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఫైర్ ఆఫీసర్ శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ధన్వాల్, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలకు కుళ్లిపోయిన కోడిగుడ్లు

- కాంట్రాక్టర్‌పై చర్యలకు తల్లిదండ్రుల డిమాండ్
- సీడీపీఓ, మాతాశిశు సంక్షేమ శాఖకు ఫిర్యాదు

-ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 4: హుస్నాబాద్ పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ కుళ్లిపోయినవి పంపిణీ చేస్తున్నారని, దీంతో నవజాత శిశువులు, బాలింతలు, గర్భిణులు వాటిని తినలేకపోతున్నారని పలువురు నేతలు నాయకులు ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న సదరు వ్యక్తిపై చట్టరీత్యా కేసు నమోదు చేయాలని మాతాశిశు సంక్షేమ శాఖ అధికారి జయప్రదకు ఫిర్యాదు చేశారు. నాసిరకం కోడిగుడ్లలో చిన్నారులకు ఏదైనా జరిగితే ఎవరూ బాధ్యులని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ప్రశ్నించారు. వీరితో బీజేపీ, బీఎస్పీ నాయకులు వరియోగుల అనంతస్వామి, ఎలగందుల శంకర్, పోలోజు రాజేందర్ తదితరులు ఉన్నారు.

నాలుగు రోజులుగా కేంద్రంలోనే నిలిచిన ధాన్యం

- వర్షంతో నష్టపోనున్న రైతులు
- సింగిల్ విండో అధికారుల నిర్లక్ష్యం
- అధికారుల తీరుపై మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేష్ ఆగ్రహం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 4: రైతులు కాంట పెట్టిన ధాన్యాన్ని నిల్వ కేంద్రాలకు తరలించకుండా కేంద్రంలోనే వదిలేయడం పట్ల అధికారులపై సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలోని ఆరెపల్లికి చెందిన రైతులు నమిలికొండ రాజయ్య, కల్లూరి భూమయ్య, కాశబోయిన రాజవ్వ, గడిపె లక్ష్మీనారాయణలు గత శనివారం (నవంబర్ 1) తమ సుమారు 600 బస్తాల ధాన్యాన్ని కాంట పెట్టారు. అయితే నాలుగు రోజులు గడిచినా ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు నిల్వ కేంద్రాలకు తరలించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట వర్షం కురవడం వల్ల ధాన్యం తడిసే పరిస్థితి ఏర్పడిందన్నారు. సింగిల్ విండో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, కాంట పెట్టిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించే చర్యలు తీసుకోవాలని గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు. రైతుల ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం ప్రదర్శించిన విశాల పరపతి సహకార సంఘం అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

7 న నిరుద్యోగ యువకులకు జాబ్ మేళా

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 4 : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు నిర్మల్ లోని లోని ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ మరియు ప్రథమ్ ఎడ్యుకేషన్ కంపెనీ లో ఉద్యోగాలు కల్పించుటకు నవంబర్ 07 శుక్రవారం రోజున ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఐ. గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు.నిర్మల్ లో ప్రొడక్ట్ ట్రైనీ మరియు హాస్పిటాలిటీ తదితర పోస్ట్ లు ఖాళీలు ఉన్నాయని, పోస్టులకు పదవ తరగతి , ఇంటర్, డిప్లమా ఇఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 17 నుంచి 25లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లో (సెమినార్ హాల్)వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9154679103 , 9642425265 నెంబర్ లకు సంప్రదించలని కోరారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో
హుస్నాబాద్ నాయకుల ప్రచారం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 4: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా హుస్నాబాద్ నియోజకవర్గం నుండి భారీగా కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. అక్కనపేట మండలం నుండి మాజీ ఎంపీటీసీ బానోత్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలంటూ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. విద్యావంతుడు, స్థానికుడు, ప్రజల్లో నిత్యం మమేకమై ఉండే నాయకుడైన నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ అభివృద్ధికి కృషి చేస్తారని భాస్కర్ నాయక్ పేర్కొన్నారు. నవీన్ యాదవ్‌కు విపరీతమైన ప్రజా మద్దతు లభిస్తోందని, రాబోయే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

8 నాటికి 'సీఎంఆర్' రైస్ డెలివరీ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్(పెద్దపల్లి), నవంబర్-4: 2024-25 ఖరీఫ్ సీజన్ సంబంధించి పెండింగ్ సీఎంఆర్ రైస్ డెలివరీ నవంబర్ 8 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఖరీఫ్ పెండిరగ్ సీఎంఆర్ రైస్ డెలివరీ పై అదనపు కలెక్టర్ డి. వేణు తో కలిసి సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల యాజమాన్యం తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2024 సీజన్ సంబంధించి 99.5 శాతం సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసి సీఎంఆర్ డెలివరిలో రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని , దీనికి కృషి చేసిన మిల్లర్లకు, అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలోని 11 రైస్ మిల్లుల పరిధిలో మరో 29 ఏసికే రైస్ సరఫరా పెండిరగ్ ఉందని, పెండిరగ్ రైస్ డెలివరీ కూడా గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. రబీకి సంబంధించి రైస్ డెలివరీ కూడా గడువు లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కేటాయింపు కు బ్యాంకు గ్యారంటీ అందించడం తప్పనిసరిగా ఉందని కలెక్టర్ తెలిపారు. మిల్లర్లందరు తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 4: సోన్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన అటక్ లాలాబాయి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు మెరుగైన చికిత్స నిమిత్తం రూ. 2 75 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అందజేసారు. ఎల్‌ఓసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు లబ్ధిదారు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మండల అధ్యక్షులు మార గంగా రెడ్డి, బీజేపీ నాయకులున్నారు.

7న కరీంనగర్‌కు గవర్నర్ రాక

- కలెక్టర్ పమేలా సత్పతి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 4: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ నెల 7న శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, నగర పాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీసు, వైద్య, విద్యుత్ శాఖ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటనలో ప్రోటోకాల్ పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు కార్యక్రమాలకు సమయపాలన పాటించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను మెడికల్ టీం, 108,104 ,ప్రత్యేక డాక్టర్ల బృందం ఏర్పాటు చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అలాగే డయాస్ ఇతర ఏర్పాట్లు ఆర్అండ్‌బీ అధికారులు చూడాలని, తాగునీరు, శానిటేషన్, ఫాగింగ్ వంటి ఏర్పాట్లు చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డీసీపీ వెంకటరామిరెడ్డి, ఏసీపీలు పోలీసు, వైద్య, విద్య , రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం

- నీట మునిగిన పంట పొలాలు
- తడిసిన ధాన్యం.. రైతుల ఆవేదన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 4: కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షం రైతుల జీవితాలను దెబ్బతీసింది. రాత్రి పొద్దుపోయే వరకు మేఘాలు కమ్ముకొని ఉన్న వాతావరణం, తెల్లవారుజామున ఒక్కసారిగా కుండపోతలా కురిసిన వర్షంగా మారి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం మిగిల్చింది. హుజురాబాద్, చొప్పదండి, కరీంనగర్ పట్టణ పరిసర గ్రామాల్లో అకాల వర్షం పంటలపై ప్రతికూల ప్రభావం చూపింది. హుజురాబాద్ మండలంలోని సిర్సపల్లి గ్రామంలో రైతులు ఎండబెట్టడానికి రోడ్ల పక్కన ఉంచిన వరి ధాన్యం పూర్తిగా వర్షపు నీటిలో మునిగిపోయింది. వర్షం తీవ్రత ఎక్కువగా ఉండటంతో, ఎండిన వరి కుప్పలు నీటిలో కొట్టుకుపోయి మురికి కాలువల్లో కలిసిపోయాయి. చేతికొచ్చిన పంట ఒక్కసారిగా నీటిలో కలిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "సంవత్సరం పొడవునా కష్టపడి పండిరచిన పంట కళ్లముందే నాశనం అయింది'' అంటూ పలువురు రైతులు కన్నీరు మున్నీరుగా వాపోయారు. వర్షం కారణంగా పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంట పొలాలు నీటితో నిండిపోయి, రవాణా సౌకర్యాలు దెబ్బతిన్నాయి. వర్షపు నీరు చెరువులు, వాగులు, చిన్న నీటి మార్గాల్లోకి చేరి కొన్ని చోట్ల ఉప్పొంగింది. కొన్ని గ్రామాల్లో ఇళ్లలోకి కూడా వర్షపు నీరు చొచ్చుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని, ఎండబెట్టే స్థలాలు ఏర్పాటు చేయాలని, మరియు వర్షపాతం ప్రభావిత ప్రాంతాల్లో సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టం అంచనా వేయడానికి ప్రత్యేక బృందాలను పంపనున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని పలు మండలాల్లో వర్షపాతం 60 నుండి 90 మిల్లీమీటర్ల మధ్య నమోదైనట్లు వాతావరణ విభాగం వెల్లడించింది. రాబోయే రెండు రోజులు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని కూడా అధికారులు హెచ్చరించారు.

మంత్రి పొన్నం వెంటనే రాజీనామా చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 4: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండిరగ్లో ఉన్న రియంబర్స్మెంట్ విడుదల చేయాలని మంగళవారం మంకమ్మతోటలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటి ముట్టడించారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ మంత్రి పొన్న ప్రభాకర్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై కపట ప్రేమ నటిస్తూ, విద్యార్థులను పట్టించుకోవడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళాశాలలను బ్లాక్ మెయిల్ చేస్తూ విజిలెన్స్ దాడులు నిర్వహిస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని అన్నారు. లేని యెడల స్థానిక మంత్రులను, ఎమ్మెల్యేలను ఎక్కడికి అక్కడ అడ్డుకుంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు అసెంబ్లీ వినయ్ సాగర్, దుర్గం భోగేష్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్,గన్నారపు రాకేష్, సందేశ్,నాయకులు సన్నీత్, సంతోష్,హరీష్,రాకేష్, మొలుగురి నరేష్,అజయ్,తదితరులు పాల్గొన్నారు.



లాబీయింగ్ చేసేవారికే నేషనల్ అవార్డులు వస్తున్నాయి. మమ్ముట్టి లాంటి గొప్ప నటుడికి జాతీయస్థాయి గుర్తింపు రాకపోవడం విచారకరం. లాబీయింగ్‌తో వచ్చే అవార్డులు ఆయనకు అవసరం లేదు. కేరళ జ్యూరీలో చైర్మన్‌గా తనకు స్వేచ్ఛ ఇస్తామని చెప్పి తరువాత సభ్యులు జోక్యం చేసుకున్నారు.

- నటుడు ప్రకాశ్ రాజ్

ప్రాంతీయం

బంద్ కు అన్ని విద్యార్థి సంస్థల మద్దతు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 4: ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదలకై ప్రైవేటు విద్యాసంస్థల బంద్ కు అన్ని విద్యార్థి సంస్థలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రవేట్ కళాశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్ మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాల నుండి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో అటు కాలేజీల భవిష్యత్తు ఇటు విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారడంతో కళాశాలలను నిరవధికంగా బంద్ చేసి తమ నిరసనను తెలుపుతున్నట్లు తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యులకు తమ మద్దతును బేషరతుగా ప్రకటించారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని అన్ని విద్యార్థి సంఘాల సంస్థలు ముఖ్యంగా డిగ్రీ కాలేజీల్లో చదువుతున్నది నిరుపేదలే, ఎంతోమంది మధ్యతరగతి కుటుంబాలకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నవి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలే. ఈరోజు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కొన్ని వందల అధ్యాపక కుటుంబాలు, కళాశాలల సేవా సిబ్బంది కుటుంబాలు రోడ్డు మీద పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థులు పాసైన వారికి సర్టిఫికెట్లు సరైన సకాలంలో అందకపోవడంతో అటు వారికి ఉద్యోగాలు పై చదువులకు కూడా ఆటంకంగా మారిందని, ఇదే పరిస్థితి కొనసాగితే కళాశాలలు మూతపడే పరిస్థితి ఉందని వాపోయారు. ఇటు రెండు వైపులా ఇబ్బందులు తలెత్తడంతో భవిష్యత్తులో ఇది సామాజిక సమస్యగా పరిగణించబోతుందన్నారు. ఇటువంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేది విద్యార్థి సంఘాల నాయకులేనని వారి మద్దతు కోరగా వారందరూ వచ్చి భేషరతుగా మద్దతు ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, ఏఐపీఎస్ యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, టీజీవీపీ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్, ఏఐఎస్బీ రాష్ట్ర నాయకులు రాజు గౌడ్, పీడీఎస్ యూ జిల్లా నాయకులు వినోద్, డీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్, గిరిజన శక్తి జిల్లా అధ్యక్షులు రామచందర్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు యూసుఫ్, టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నష్టం త్వరగా నమోదు చేయండి

- దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 4: భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు త్వరగా నమోదు చేసి నివేదికను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ధర్మసాగర్ దేవునూరు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు, వంతెన, వరి పంటలు దెబ్బతినగా కలెక్టర్ నడుచుకుంటూ వెళ్లి అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. రోడ్ల మరమ్మతు పనుల గురించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. గ్రామంలో పంట నష్టం, రోడ్ల నష్టం పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ సుమారుగా అర కిలోమీటరు మేర నడుచుకుంటూ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో వేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఎంత మేరకు నష్టం జరిగిందని వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులకు చెందిన పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించి జరిగిన పంటల నష్టం గురించిన వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో దెబ్బతిన్న పంటల వివరాల నమోదు చేస్తున్న సమాచారాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సర్వే నంబర్లు, రైతుల వారీగా వివరాలను నమోదు చేయాలన్నారు. వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారానికి నివేదిక అందించాల్సి ఉండగా వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనా వివరాలను త్వరగా అందజేయాలన్నారు. అక్కడినుండి ముప్పారం గ్రామానికి చేరుకొని గ్రామంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించారు. గ్రామంలో తీవ్రమైన వరద ధాటికి రోడ్లు బాగా దెబ్బతినగా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు కలెక్టర్ కు వివరించారు. వరదలతో పశు సంపదకు జరిగిన నష్టం గురించిన వివరాలను కలెక్టర్ కు తెలియజేశారు. వరద తాకిడికి సుమారు 450 క్వింటాళ్ల వరి ధాన్యం కొట్టుకుపోయిన వివరాలను తెలియజేశారు. స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. స్థానిక చెరువు నుండి వచ్చిన వరద నీటితో దెబ్బతిన్న రోడ్లను, పంట నష్టాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదిత అంచనాల నివేదికను అందజేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ధర్మసాగర్ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ కు ఎంత ఇన్ ఫ్లో వస్తుందని, రిజర్వాయర్ కెపాసిటీ, అవుట్ ఫ్లో గురించి నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత నెల 29వ తేదీన రిజర్వాయర్ లో ఉన్న నీటి సామర్థ్యం, ఇతర వివరాలను కలెక్టర్ కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, డిఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఏవో రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ డిమాండ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 4 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ డిమాండ్ చేశారు. కామారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద విద్యార్థులతో కలిసి మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం బకాయి పడిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీపావళి వరకు రూ.1200 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట నిలుపుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కళాశాలలకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడం సరికాదన్నారు. కళాశాలల బంద్‌కు బీవీఎం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీవీఎం జిల్లా అధ్యక్షుడు ఆర్బాస్ ఖాన్, ఇన్‌ఛార్జి పెరుమాండ్ల బుల్లెట్, కార్యదర్శి శ్యాం, నాయకులు కార్తీక్, శివ, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల తీరు హాస్యాస్పదం

- యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దార అశోక్

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 4: మణుగూరు పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించిన చర్యలపై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని గుండాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దార అశోక్ అన్నారు.మంగళవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.కాంగ్రెస్ జెండాపై గెలిచి, తర్వాత స్వలాభం కోసం గులాబీ కండువా కప్పుకున్నవారే పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేసి "బీఆర్ఎస్ భవన్"గా మార్చారని విమర్శించారు.అధికారం ఉన్నా లేకున్నా ఆ భవనం కాంగ్రెస్‌కే సొంతమని, ఐదేళ్లుగా పార్టీ భవనం నుంచి దూరం చేయడం కాంగ్రెస్ శ్రేణుల ఓర్పుని పరీక్షించినట్లేనని అన్నారు. భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడమే తమ ధ్యేయమని,దానిపై కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి పవన్ కళ్యాణ్, యువజన నాయకులు ఎస్కె వాజీద్ పాషా, ఎస్కె ఇస్రార్, బొంగు చంద్రశేఖర్, పల్లపు రాజేష్, సోషల్ మీడియా నాయకుడు మండలోజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు
దుకాణాల్లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 4: గుండాల మండలంలో గడువు ముగిసిన పదార్థాల విక్రయాలపై ప్రతిపక్షం పత్రికలో సోమవారం ప్రచురితమైన "గడువు ముగిసిన పదార్థాల అమ్మకం" కథనానికి స్పందించిన అధికారులు .పత్రికలో వచ్చిన వార్తల ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్,ఏనాలసిస్ ఆఫీసర్ రతన్ మంగళవారం మండలంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు కొన్ని నమూనాలు సేకరించారు.ఈ తనిఖీలో గుండాల తహసీల్దార్ ఖాసీం పాల్గొన్నారు.అనంతరం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్ మాట్లాడుతూ,ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా నడుపుతున్న షాపుల నిర్వాహకులు 15 రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.భవిష్యత్తులో గడువు తీరిన లేదా నాణ్యత లేని వస్తువులను విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయని, వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే ముందు గడువు తేదీని తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు.అదేవిధంగా గుండాల లోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ల్యాబ్ ద్వారా కొన్ని పరీక్షలు చేసే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రతిపక్షం

గడువు ముగిసిన పదార్థాల అమ్మకం

- ప్రజల ఆరోగ్యంపై ముప్పు

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 2: గుండాల మండలంలోని పలు గ్రామాల్లో గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్, జ్యూస్ బాటిళ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు,పాలు పెరుగు వంటివి కొన్ని దుకాణాల్లో తెగబడి విక్రయమవుతున్నాయి. లాభాల కోసం కొంతమంది వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మార్కెట్‌లో లభిస్తున్న కొన్ని ప్రముఖ బ్రాండ్ల కూల్‌డ్రింక్స్ బాటిళ్లపై గడువు తేదీ ముగిసినా అవి ఇంకా షెల్ఫ్‌లపై ఉండడం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది. కొంతమంది తల్లిదండ్రులు ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు, యువత తరచుగా ఉపయోగించే ఈ పదార్థాలు ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు ఇలాంటి గడువు తేదీ ముగిసిన వి తీసుకుంటే ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని వారు సూచిస్తున్నారు. గడువు ముగిసిన పానీయాల్లో హానికరమైన రసాయన మార్పులు జరగవచ్చు. ఫుడ్ పాయిజనింగ్, వాంతులు, కడుపునొప్పి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఇలాంటి ఉత్పత్తులను విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గడువు తీరిన వస్తువులను మార్కెట్‌లో ఉంచడం చట్టవిరుద్ధమని, ఆహార భద్రత చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

epaper.prathipaksham.in
03 Nov 2025 - Page 5

వివాహితను వేధించిన వైద్యుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారిపై కేసు నమోదు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 4: ఓ వివాహితతో అసభ్య కరంగా ప్రవర్తించిన డెంటల్ డాక్టర్ అమర్‌నాథ్, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆయిల్ గంగాధర్ లపై నాల్గో టౌన్ లో మంగళవారం కేసు నమోదు అయినది. నగరంలోని ప్రముఖ డెంటల్ డాక్టర్ , రియల్ ఎస్టేట్ వ్యాపారి వేధింపులకు పాల్పడటంతో బాధితురాలు గత సోమవారం నేరుగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ను కలిసి విషయం తెలిపింది. సీపీ ఆదేశాల మేరకు వారిద్దరిపై నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను గతంలో ఓ ట్రావెల్స్‌లో పని చేశానని చేస్తుండగా డెంటల్ డాక్టర్ అమర్నాథ్, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆయిల్ గంగాధర్ లు తనపై వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులు పేర్కొంది. సంస్థలో పని చేస్తున్న పనుల నిమిత్తం వచ్చి తనను అసభ్యంగా తాకేవారని, అప్పుడు తనకు పెళ్లికాకపోవడంతో భయపడి ఎవరికి చెప్పలేదని తెలిపింది. అక్కడ జాబ్ మానేసిన తర్వాత కూడా వారు వేధిస్తున్నారని ఆమె తెలిపింది. ఈ మేరకు సోమవారం సీపీ సాయి చైతన్యను కలిసి ఫిర్యాదు చేశానని తెలిపింది. ఆయన సూచన మేరకు మంగళవారం నాలుగో టౌన్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సదరు వైద్యుడు అమర్‌నాథ్, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆయిల్ గంగాధర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైద్యుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి రూ.7 లక్షల ఎల్ఓసీ

- కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4: వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలం మానాజీపేట గ్రామానికి చెందిన రాజేష్ తన రెండేళ్ల కుమారుడు అభిదేవ్ చెవిటి, మూగ సమస్యతో బాధపడుతున్నాడు.ఈ క్రమంలో బాలుడికి చికిత్స చేయించడం కోసం తమ ఆర్థిక పరిస్థితి సరిపోవడం లేదని మాకు ఆర్థికపరమైన సహాయ సహకారాలు అందించాలని బాలుడి కుటుంబ సభ్యులు వనపర్తి ఎమ్మెల్యే. తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. బాలుడి ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే.మేఘా రెడ్డి ప్రభుత్వం నుంచి రూ. 7 లక్షల ఎల్ ఓసీని మంజూరు చేయించారు.మంజూరైన ఎల్ఓసీని మంగళవారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందజేశారు.కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తమ బిడ్డ ఆరోగ్య నిమిత్తం రూ. 7 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మనాజిపేట మాజీ సర్పంచ్ సతీష్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

మరణంలోనూ కనీస గౌరవం లేకపోవడం బాధాకరం. రాష్ట్రంలో అంబులెన్స్‌లు ,మార్చురీ వ్యాన్‌లు లేవా? చనిపోయిన వారికి, వారి కుటుంబాలకు కనీస గౌరవం ఇవ్వకుండా అమానవీయంగా ప్రవర్తించారు. మీర్జాగూడ బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను తోపుడు బండ్లు, ట్రాక్టర్లు, చెత్త వ్యాన్లు, టోయింగ్ వాహనాలపై ఇలా తీసుకెళ్లడం ఏంటి.?
- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

తుడుందెబ్బ మేడారం అధ్యక్షుడిగా సునీల్

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 4: మేడారం గ్రామ పెద్దల సమీక్ష సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ చీడం బాబురావు సిద్దబోయినా స్వామి పూజారి, పీరీల వెంకన్న ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గడిగ సునీల్, వట్టం సురేష్, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పీరీల వినోద్, సహాయ కార్యదర్శిగా వట్టం నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్గా ఆలం శంకర్, అధికార ప్రతినిధిగా సిద్ధబోయిన రవి, స్పోర్ట్స్ ఫోక్ పర్సన్ కోట ప్రసాద్, కోశాధికారి ఆలం సమ్మారావు, ప్రసార కార్యదర్శి ఆలం సుధీర్ ఎన్నికయ్యారు. ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ ఆదివాసీల పైన జరుగుతున్న సమస్యల పైన పోరాటం మరియు ఫలితాల చేదాక మేడారంలో రెండో పంట నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. రోడ్లు వెడల్పు చేస్తున్న క్రమంలో భూములు కోల్పోతున్న ప్రజలకు నష్టపరిహారం ఇవ్వాలి. గత 20 సంవత్సరాల నుండి ఆదివాసీ ప్రజలు పోడు సాగు చేసుకుంటున్న పట్టాలు రాలేదు ఈ ఈ ప్రభుత్వం అయినా ఆదివాసీలకు పట్టాలు ఇవ్వాలి షెడ్యూల్ ఏరియాలో ఐటీడీఏ ద్వారా వీడీసీ వర్కులు ఆదివాసులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ

- 18 గ్రామాలకు 99,11,484 రూపాయలు అందజేత

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 4: నర్వ మండల కేంద్రంలోని రైతు వేదిక నందు రోజు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యకార, పాడి పరిశ్రమ,క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా, కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. నర్వ మండల కేంద్రంలోని రైతు వేదిక నందు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కుల పంపిణీ నర్వ మండల తహసిల్దార్ మల్లారెడ్డి, నర్వ మండల ఎంపీడీవో శ్రీనివాస్ పేదల మీదగా అందజేయడం జరిగింది. నర్వ మండలంలోని 18 గ్రామాలకు 9,911,484₹ తొంబై తొమ్మిది లక్షల పదకొండు వేల నాలుగు వందల ఎనభై నాలుగు రూపాయల చెక్కులను అందజేశారు. నర్వ (14), రాంపూర్ (4), కుమార్ లింగపల్లి (3), జంగం రెడ్డి పల్లి (2), లంకాల (4), యాంకి (3), నాగిరెడ్డిపల్లి (2), బెక్కరపల్లి (1), ఎల్లంపల్లి (3), పెద్ద కడుమూర్ (8), కొత్తపల్లి (6), కల్వల్ (5), సీపూర్ (7), పాతర్చేడ్ (7), ఉందేకోడ్ (9), లక్కర్ దొడ్డి (6), జక్కన్న పల్లి (3), రాయికోడ్ (12), ఈ 18 గ్రామాలకు చెక్కులను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నర్వ మండల అధికారులు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, చెక్కుల లబ్ధిదారులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని 150 సార్లు పేల్చగలం

- తమ 'అణు' సామర్థ్యం అలాంటిదన్న ట్రంప్

న్యూయార్క్ (అమెరికా), నవంబర్ 4: అణ్వాయుధ పరీక్షలు చేపట్టేందుకు జారీ చేసిన ఆదేశాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. అమెరికా వద్ద పుష్కలమైన అణ్వాయుధాలు ఉన్నాయని, ఈ ప్రపంచాన్ని 150 సార్లు పేల్చ గలమని చెప్పారు. అయితే వాటిని యాక్టివ్ ట్రయల్స్ ద్వారా మెయింటెన్ చేయాల్సి ఉందన్నారు. 30 యేండ్ల తర్వాత మళ్లీ ఎందుకు అణ్వాయుధ పరీక్షలకు ఆదేశాలు జారీ చేశారని అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఇలా బదులిచ్చారు. ఆ అణ్వాయుధాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవాలని, ఇతర దేశాల తరహాలో తాము కూడా అణ్వాయుధాలను పరీక్షిస్తామని అన్నారు. ప్రస్తుతం తాము మాత్రమే టెస్ట్ చేయడం లేదని, పరీక్షలు చేపట్టని దేశాల జాబితాలో తాము ఉండడం తనకు ఇష్టం లేదని ట్రంప్ అన్నారు. అమెరికా చివరిసారి 1992లో అణ్వాయుధాన్ని పరీక్షించింది. ఒకవేళ మళ్లీ పరీక్షలు నిర్వహించాలంటే, వందల మిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలలో నిజమైన న్యూక్లియర్ పరీక్షలు ఉండవని ఎనర్జీ మంత్రి క్రిస్ రైట్ క్లారిటీ ఇచ్చారు. వాటిని నాన్ క్రిటికల్ పరీక్షలుగా పిలుస్తున్నట్లు చెప్పారు. రష్యా, చైనా దేశాలు సీక్రెట్‌గా అణు పరీక్షలు చేపడుతున్నట్లు ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. కానీ, ఆ రెండు దేశాలు తమ చివరి అణు పరీక్షలను 1990 దశకంలోనే నిర్వహించినట్లు తెలుస్తోంది. కాగా, ఇటీవల నిర్వహించిన బురవెస్నిక్ క్రూయిజ్ క్షిపణి, పోసిడాన్ టార్పిడో పరీక్షలలో అణ్వాయుధం వాడలేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్ర పీస్కోవ్ తెలిపారు. ఒకవేళ ఇతర దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తే దాని ఆధారంగా తాము చేపడుతామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు.

విశ్వ వీక్షణం

రైలు ప్రమాదంలో ఆరుగురి మృతి

- బిలాస్ పూర్ దగ్గరు గూడ్సును ఢీకొన్న ప్యాసింజర్ రైలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, రాయపూర్ (ఛత్తీస్ గఢ్), నవంబర్ 4: ఛత్తీస్ గఢ్ లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బిలాస్ పూర్ గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. సిగ్నల్ వ్యవస్థ వైఫల్యం లేదా మానవ తప్పిదం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్యాసింజర్ రైలు ముందు భాగం గూడ్స్ రైలుపైకి పైకి ఎక్కింది. ఒక బోగీ పూర్తిగా దెబ్బతింది. వెంటనే అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం, రైల్వే యంత్రాంగం సహాయచర్యలకు దిగాయి. దెబ్బతిన్న రైలు బోగీలలో చిక్కుకున్నవారిని రక్షించాయి. ఈ క్రమంలో నాలుగు మృతదేహాలను వెలికితీశాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు.

ప్రోత్సాహం ప్రతిభ.. కుదిరిన 'గురి'

వరుసగా రెండో సారి బంగారు పతకాన్ని సాధించిన రశ్మితా రెడ్డి.. రాష్ట్ర స్థాయి ఎస్ జీ ఎఫ్ క్రీడల్లో బంగారు పతకం

ఆర్చరీ ఛాంపియన్షిప్2025 సాధించిన రశ్మితారెడ్డి.. జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ పోటీలలో బంగారు పతకం

కత్తుల లక్ష్మారెడ్డి, సిద్ధన్నపేట

పిల్లలను వారి ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహిస్తే వారు ఎంచుకున్న రంగంలో ప్రతిభ కనబరుస్తారు. ఇందుకు నిదర్శనమే సిద్ధిపేటకు చెందిన చిరుకోటి రశ్మితారెడ్డి. తెలంగాణ క్రీడా పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రశ్మితారెడ్డి రాష్ట్ర స్థాయి ఆర్చరీ క్రీడా పోటీల్లో వరుసగా రెండోసారి బంగారు పథకాన్ని సాధించింది. ఇప్పటికే జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ లలో బంగారు పతకాలు, రాష్ట్రస్థాయి సీఎం కప్ లో వెండి పతకం సాధించిన రశ్మితారెడ్డి తాజాగా పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో 17 సంవత్సరాల లోపు ఆర్చరీ బాలికల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లి కుదురు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం జరిగిన ఇండియన్ రౌండ్ లో ప్రతిభను కనబర్చి ప్రథమ స్థానంతో రశ్మితారెడ్డి బంగారు పథకం సాధించింది. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా, జోనల్ స్థాయిల్లో నిర్వహించిన 17 సంవత్సరాలలో బాలికల విభాగంలో ఆర్చరీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. రాష్ట్రంలోని 33 జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులకు సోమవారం మహబూబాబాద్ లో ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన రశ్మితారెడ్డి బంగారు పథకాన్ని కైవసం చేసుకున్నది. రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో రశ్మితారెడ్డి 10వ తరగతి చదువుతోంది. తెలంగాణ క్రీడా పాఠశాలలో తనకు ఇష్టమైన ఆర్చరీ క్రీడలో అక్కడి ఉపాధ్యాయులు, స్పోర్ట్స్ కోచ్ డాక్టర్ రవిశంకర్ సాయంతో మెళకువలు నేర్చుకుంది.

జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆర్చరీ ఛాంపియన్ షిప్

గత సంవత్సరం జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆర్చరీ ఛాంపియన్ షిప్2025 పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. సంగారెడ్డి జిల్లా కొల్లూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మైదానంలో గత సంవత్సరం ఈ పోటీలు జరిగాయి. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఛాంపియన్ షిప్ పోటీలలో వివిధ జిల్లాల నుంచి ఆర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారు. అయా జిల్లాల స్థాయిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన 31 మంది క్రీడాకారులతో పోటీ పడిన రశ్మిత రెడ్డి ఆర్చరీలో ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాల, మండల, జిల్లా స్థాయి పోటీలలో అర్చరీలో ప్రతిభ కనబరచడంతో రశ్మితా రెడ్డిని రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. రంగారెడ్డి జిల్లా పక్షాన రశ్మితారెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించింది.

రాష్ట్రస్థాయి సీఎం కప్ లో వెండి పతకం

రాష్ట్రస్థాయి సీఎం కప్2024 పోటీలలో స్టేట్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ లో రశ్మితా రెడ్డి సిద్దిపేట జిల్లా తరపున పాల్గొని రెండో స్థానంలో నిలిచింది. సీఎం కప్2024లో భాగంగా సిద్దిపేట జిల్లాలో గ్రామ మండల జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొని చక్కటి ప్రతిభను కనబరిచిన ఈ చిన్నారి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 31 నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సీఎం కప్2024 కోసం స్టేట్ ఆర్చరీ ఛాంపియన్షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో చక్కటి ప్రతిభను కనబరిచిన రశ్మితా రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో....

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ కు చెందిన చిరుకోటి నరేందర్ రెడ్డి, లాస్య దంపతుల కుమార్తె రశ్మితారెడ్డి రంగారెడ్డి జిల్లాలోని క్రీడా పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. వృత్తిరీత్యా హోంగార్డు అయిన చిరుకోటి నరేందర్ రెడ్డి ప్రస్తుతం హోం గార్డ్స్ అసోసియేషన్ సిద్ది పేట జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. వృత్తిరీత్యా సిద్దిపేటలో ఉంటున్న నరేందర్ రెడ్డి ,లాస్య దంపతులు తమ కూతురు రశ్మితారెడ్డికి క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మెరీడియన్ పాఠశాలలో చదువుతున్నప్పుడే క్రీడల్లో ప్రతిభను కనబరిచింది. దీంతో నాలుగో తరగతి చదువుతున్నప్పుడు తెలంగాణ క్రీడా పాఠశాల ఎంపికకు జరిగిన పోటీ పరీక్ష రాయించారు. క్రీడా పాఠశాలకు నిర్వహించిన పోటీ పరీక్షలో రశ్మితా రెడ్డి చక్కటి ప్రతిభ కనబరిచి క్రీడా పాఠశాలలో సీటు సాధించింది. ఐదో తరగతిలో క్రీడా పాఠశాలలో చేరిన రశ్మితా రెడ్డి తనకు ఆసక్తి కలిగిన ఆర్చరీ క్రీడలో శిక్షణ పొందుతూ చదువుతోంది. ఈ సందర్భంగా రశ్మితా రెడ్డి మాట్లాడుతూ ఆర్చరీ క్రీడలో మరిన్ని పథకాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పొందేందుకు కృషి చేస్తానని తెలిపింది. తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 17 ఏళ్ల లోపు రాష్ట్ర స్థాయి బాలికల విభాగంలో ఆర్చరీ పోటీలలో బంగారు పతకాన్ని సాధించిన రశ్మితా రెడ్డిని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కోచ్ డాక్టర్ రవిశంకర్, సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు. రశ్మితా రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

'వరల్డ్ జస్టిస్' ర్యాంకులో దిగజారిన ఇండియా

- 143 దేశాలలో 86వ స్థానంలో నిలిచిన భారత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 4 : దేశం తిరోగమనం చెందుతున్నది. దేశ ప్రగతికి కొలమానంగా నిలిచే అంతర్జాతీయ సూచీలలో భారత్ ర్యాంకు అంతకంతకూ దిగజారుతున్నది. తాజాగా విడుదలైన వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా ఇండెక్స్2025లో ఇండియా ర్యాంకు మరింత పతనమైంది. 143 దేశాలకుగానూ నిరుడు 79వ స్థానంలో నిలిచిన భారత్ ఈ యేడాది ఏడు స్థానాలు దిగజారి 86వ ర్యాంకుకు చేరింది. ప్రభుత్వ అధికారాలపై నియంత్రణలు, అవినీతి రాహిత్యం, ప్రభుత్వ పారదర్శకత, ప్రాథమిక హక్కులు, శాంతి భద్రతలు, చట్టాల అమలు వంటి అంశాలలో ఆయా దేశాలలో సాధించిన ప్రగతి ప్రాతిపదికన చట్టబద్ధ పాలన సూచీ రూపొందుతుంది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూల్ ఆఫ్ లా ఇండెక్స్‌లో భారత్ ర్యాంకు యేటేటా దిగజారుతూ వస్తున్నది. 2015లో ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో భారత్ 57వ స్థానంలో ఉండగా, 2025కి 86వ ర్యాంకుకు దిగజారింది. ఇక అవినీతిరహిత దేశాల జాబితాలో నిరుడు 97వ స్థానంలో ఉండగా, ఈ యేడాది 99వ స్థానానికి చేరింది. మోడీ పాలనలో దేశ ప్రజల ప్రాథమిక హక్కులు ఏ స్థితిలో ఉన్నాయో రుజువు చేసేందుకు ఈ ర్యాంకే నిదర్శనం. 2015లో భారత్ 62వ స్థానంలో ఉండగా, ఈ యేడాది 103వ స్థానానికి పడిపోయింది. చట్టాల అమలు యంత్రాంగం పనితీరులోనూ శాంతి భద్రతల విషయంలో నిరుడు 98వ ర్యాంకులో ఉన్న భారత్ ఈ యేడాది 105వ స్థానానికి పడిపోవడం క్షీణించిన శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతోంది. చట్టాల అమలు యంత్రాంగం పనితీరులో గత యేడాది 78వ ర్యాంకులో ఉన్న భారత్ ఈ యేడాది 79వ స్థానానికి పడిపోయి మోడీ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేసింది.

అమెరికాకు తిప్పలు తెచ్చిన 'షట్ డౌన్'

- దేశమంతటా స్తంభించిన విమాన సేవలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 4 : అమెరికాలో ప్రభుత్వ షట్ డౌన్ అక్టోబర్ ఒకటి నుంచి మొదలైన విషయం తెలిసిందే. దీంతో కొన్ని అత్యవసర సేవల విభాగాలకు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ విభాగాలలో ఉద్యోగుల వేతనాలు, ఇతర చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. అనేక నగరాలలోని విమానాశ్రయాలలో 'ఏటీసీ' సిబ్బంది విధులకు హాజరు కావటం లేదు. దీంతో ఎయిర్‌పోర్టులలో సిబ్బంది కొరత ఏర్పడింది. ఫలితంగా అమెరికా వ్యాప్తంగా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం ఒక్క రోజే దాదాపు ఐదు వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయని అమెరికా మీడియా వెల్లడించింది. 2,530కి పైగా విమానాలు ఆలస్యం కాగా, 60కి పైగా సర్వీసులు రద్దయ్యాయని పేర్కొంది. చికాగో, నెవార్క్, జాన్ ఎఫ్. కెన్నడీ, అట్లాంటా వంటి ప్రధాన విమానాశ్రయాల్లో వేలాది విమానాలు ఆలస్యమవుతుండగా, ఎయిర్‌పోర్టుల భద్రతా తనిఖీల కోసం గంటల తరబడి సమయం పడుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. లాస్‌ఏంజిల్స్, కాలిఫోర్నియా, చికాగో, వాషింగ్టన్, న్యూజెర్సీ, న్యూయార్క్ సహా అమెరికా వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. వారాంతాలలో అయితే, ఈ పరిస్థితి మరింత దిగజారుతోంది. విమానం ఆలస్యం, రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షట్ డౌన్ కారణంగా ఇప్పటి వరకూ దాదాపు 7 బిలియన్ డాలర్ల (రూ. 62,195 కోట్లు) నష్టం వాటిల్లింది.

పారిస్ లో 895 కోట్ల బంగారం చోరీ

- సాధారణ దొంగల ముఠాయే కారణమన్న పీపీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పారిస్, నవంబర్ 4: పారిస్‌లోని ప్రఖ్యాత లవ్రే మ్యూజియంలో అక్టోబరు 19న జరిగిన చోరీ ఘటన యావత్తు ప్రపంచాన్ని నివ్వేరపోయేలా చేసింది. నిమిషాల వ్యవధిలోనే విలువైన ఆభరణాలు సహా రూ. 895 కోట్ల విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. తాజాగా, ఈ కేసులో విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది. చిన్న చిన్న చోరీలు చేసే ఓ సాధారణ దొంగల ముఠా మ్యూజియంలో ఆభరణాలు ఎత్తుకెళ్లినట్టు పారిస్ ప్రాసిక్యూటర్ లారే బేకువా వెల్లడించారు. అత్యంత భద్రత కలిగిన లవ్రే మ్యూజియంలో దోపిడీని కరుడుగట్టిన నేరస్థుల ముఠా చేయలేదని చెప్పారు. సాధారణ నేరాలకు పాల్పడే ముఠాయే ఈ చోరీ చేసుంటుందని పేర్కొన్నారు. కాగా, దీని తర్వాత ఫ్రాన్స్‌లోని మరో మ్యూజియంలోనూ చోరీ జరిగిన సంగతి తెలిసిందే. మ్యూజియం చోరీ కేసులో నలుగురు అనుమానితులలో ఇప్పటి వరకూ ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. వారి నేర చరిత్రను పరిశీలిస్తే వ్యవస్థీకృత ముఠాకు చెందిన దొంగలుగా కనిపించడం లేదని అన్నారు. గతంలో శివారు ప్రాంతాలలో వారు చిన్న చిన్న నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు ఉన్నాయని వివరించారు. అరెస్టయిన ముగ్గురూ స్థానికులేనని, వారిలో ఒక మహిళ కూడా ఉందని, ఆమె వీరిలో ఒకరికి గర్ల్ ఫ్రెండ్ అని ప్రాసిక్యూటర్ చెప్పారు. పరారీలో ఉన్న నాలుగో వ్యక్తి కోసం గాలిస్తున్నామని, దోపిడీకి ప్రధాని సూత్రధాని అతడే అయి ఉంటాడని ఫ్రాన్స్ హోమ్ మంత్రి లారెన్ నిజ్ పేర్కొన్నారు.





నాలుగో టీ20కి టీమిండియా రెడీ

- తుది జట్టులోకి రానున్న నితీశ్ కుమార్ రెడ్డి

ఆస్ట్రేలియాతో మరో ఆసక్తికర పోరుకు టీమిండియా రెడీ అయ్యింది. గురువారం నాడు గోల్డ్ కోస్ట్ లో ఆస్ట్రేలియాతో నాలుగో టీ20 ఆడనుంది. మూడో టీ20లో ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిందిన భారత్ అదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలని అనుకుంటుంది. అటు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని ఆసీస్ భావిస్తోంది. దాంతో ఈ మ్యాచ్ ఉత్కంఠగా మారింది. మూడో టీ20లో టీమిండియా మూడు మార్పులు చేసింది. తుది జట్టు బాగుందని సెట్ అయ్యిందని మ్యాచ్ అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. దాంతో నాలుగో టీ20లో ఎలాంటి మార్పులు లేకుండా భారత్ బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్‌కు తిరిగి నిరాశ తప్పదు. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహకాలలో భాగంగా టీమిండియా కొన్ని ప్రయోగాలు చేస్తోంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌ను తొలి రెండు టీ20లలో ఆడించినా, వారు అంతగా రాణించలేదు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిని పక్కకు పెట్టారు. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించారు. ఈ ముగ్గురు కూడా బాగా ఆడారు. అయితే, గాయంతో తొలి మూడు టీ20లకు దూరంగా ఉన్న నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కనుంది. అతని కోసం శివమ్ దూబేను పక్కన పెట్టవచ్చు. ఈ ఒక్కటి మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు.

మహిళల జట్టుకు విజయోత్సవాలు లేవా!

- మండిపడుతున్న భారత క్రికెట్ అభిమానులు

మహిళల వన్డే ప్రపంచకప్ లో టీమిండియా విజేతగా నిలిచింది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది. 1983 ప్రపంచకప్ విజయం భారత్‌లో క్రికెట్ క్రేజ్‌ను పెంచితే, ఇప్పుడు అమ్మాయిల తాజా విజయం మహిళల క్రికెట్‌కు ఆదరణ తెచ్చిపెట్టింది. అయితే, చిరస్మరణీయ విజయం సాధించిన భారత మహిళల జట్టు విజయోత్సవ ర్యాలీ ఉంటుందని అభిమానులు భావించారు, కానీ, వారందరికీ నిరాశే మిగిలింది. ఇప్పటి వరకు బీసీసీఐ ఎలాంటి వేడుకలు నిర్వహించలేదు. క్రీడాకారులు కూడా ఎవరి స్వస్థలాలకు వారు వెళ్లిపోయారు. మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ ప్రపంచకప్ గెలిచినప్పుడు నిర్వహించిన ఊరేగింపు తరహాలో అమ్మాయిల విజయాన్ని కూడా బీసీసీఐ వేడుకలా చేస్తుందని అందరూ అనుకున్నారు. కానీ, బీసీసీఐ పట్టించుకోకపపోవడంతో అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమ్మాయిల కో న్యాయం ? పురుషులకు ఒక న్యాయమా? అని మండిపడుతున్నారు. అయితే, దుబాయిలో ఐసీసీ సమావేశం జరగనున్నందున బీసీసీఐ వేడుకలను నిర్వహించడం లేదని సమాచారం. ప్రస్తుతానికి ఎలాంటి వేడుకలు అనుకోలేదని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. ఐసీసీ సమావేశం కోసం ఆయన ఆయన సోమవారమే దుబాయికి వెళ్లారు. ఆయనతో పాటు బీసీసీఐ కీలక అధికారులు కూడా వెళ్లారు. ఐసీసీ ఈ సమావేశంలో ఆసియా కప్ గురించి ప్రస్తావించే అవకాశం ఉంది. ఏసీసీ ప్రెసిడెంట్ గా మోహ్‌సిన్ నఖ్వీ ప్రవర్తించిన తీరు, ఇప్పటి వరకు ఆసియా కప్ ట్రోఫీ అందించకపోవడంపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేయనుంది. ఈ కీలక మీటింగ్ కోసమే బీసీసీఐ.మహిళల విజయ వేడుకలు నిర్వహించలేదంటున్నారు.

ఆటలో కీలకమే అయినా పతకం దక్కలే!

- తీవ్రంగా నిరాశ చెందిన ప్రతీకి రావల్

మహిళల వరల్డ్ కప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీతో పాటు క్రీడాకారులకు వ్యక్తిగత పతకాలను కూడా అందజేశారు. కానీ, ఓ క్రీడాకారిణికి మాత్రం పతకం దక్కలేదు. ప్రపంచ కప్ విజయంలో తను కీలకంగా ఉన్నప్పటికీ, యువ బ్యాటర్ ప్రతీక రావల్‌కు మాత్రం మెడల్ అందలేదు. నిజానికి ప్రతీక రావల్ అంకితభావం, ఆమె చేసిన పరుగులు టీమిండియా టైటిల్ అందుకోవడానికి ఎంతగానో సహకరించాయి. అత్యధిక పరుగులు చేసినా ఐసీసీ నిబంధనల కారణంగా ఆమె పతకానికి దూరం అయ్యింది. ప్రతీక ఓ సెంచరీ, ఓ హాఫ్ సెంచరీ సహా 308 పరుగులు చేసింది. కానీ, ఆమెకు విజేత పతకం దరి చేరలేదు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆమె కాలికి గాయం కావడంతో జట్టు నుంచి నిష్క్రమించింది. సెమీఫైనల్‌కు ముందు ఆమె స్థానంలో షెఫాలీ వర్మను తీసుకున్నారు. ప్రత్యామ్నాయంగా ఐసీసీ నిబంధనల ప్రకారం, తుది జట్టులో ఉన్న 15 మందికి మాత్రమే మెడల్స్ ఇస్తారు. దీంతో ప్రతీక రావల్‌కు పతకం దక్కలేదు. ఆమె చేసిన పరుగులు జట్టు విజయంలో ఎంత ముఖ్యమైనవైనా, నిబంధనల ప్రకారం ఆమె మెడల్ అందుకోలేకపోయింది. గతంలోనూ 2003 పురుషుల ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు జాసన్ గిలెస్పీ కూడా నాలుగు మ్యాచ్‌లలో ఎనిమిది వికెట్లు తీసినప్పటికీ, గాయం కారణంగా మధ్యలోనే తొలగిపోవడంతో మెడల్ దక్కలేదు. భారత్ దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో గెలిచి తొలిసారి ప్రపంచ కప్ అందుకుంటున్న దృశ్యాన్ని రావల్ వీల్‌చైర్‌లో కూర్చుని చూసింది. భారత పతాకాన్ని భుజాలపై కప్పుకుని కన్నీళ్లు పెట్టుకుంది.

ప్రధాన జట్లను వీడుతున్న స్టార్ బ్యాటర్లు

- ఐపీఎల్–2026 కు జట్లలో భారీ మార్పులు

ఐపీఎల్ కొత్త సీజన్ దగ్గర పడుతున్న కొద్దీ జట్లల్లో భారీ మార్పులు చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్ ను వీడుతున్నాడని తెలిసింది. ఢిల్లీ కేపిటల్స్ కు అతడు వెళ్లనున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ కూడా జట్టును వీడబోతున్నాడని సమాచారం. 2026 వేలం కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ అతన్ని విడుదల చేసే అవకాశం ఉంది. క్లాసెన్‌ను సన్‌రైజర్స్ 23 కోట్ల రూపాయలకు అట్టి పెట్టుకుంది. పాట్ కమిన్స్ కంటే కూడా ధర ఎక్కువ. ఇప్పుడు అతడిని విడుదల చేసి, వేలంలో మళ్లీ పోటీపడాలని సన్‌రైజర్స్ యోచిస్తోందని అంటున్నారు. ఈ యేడాది అంతర్జాతీయ క్రికెట్ నుండి క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ జట్టు ఉత్తమ బెస్ట్ బ్యాటర్లల్లో ఒకడు. ఈ సీజన్ 13 మ్యాచులలో 487 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. 23 కోట్ల రూపాయల కంటే తక్కువకు అతడిని తిరిగి కొనుగోలు చేసే అవకాశం ఉంది. దీంతో మిగిలిన మొత్తంతో అన్ క్యాప్డ్ లేదా ఓ ఆల్ రౌండర్ ను తీసుకునే వెసులుబాటు ఉంటుందని సన్ రైజర్స్ హైదరాబాద్ భావిస్తోంది. మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ ను కూడా బలోపేతం చేసుకునే అవకాశం ఉంటుంది. వేలంలో క్లాసెన్ కోసం దాదాపుగా 15 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయాలని, మిగిలిన మొత్తంతో ఇతర ఆటగాళ్లను కొనుగోలు చేయాలనేది ఆ ఫ్రాంచైజీ ఆలోచన అంటున్నారు.



నాగ చైతన్య #NC24 మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్

యువ సామ్రాట్ నాగ చైతన్య తండేల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత ఇప్పుడు నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ #NC24 చేస్తున్నారు. ఈ చిత్రానికి విరూపాక్షతో సంచలన విజయాన్ని అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర , సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మక బ్యానర్లపై ప్రసాద్, సుకుమార్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె పాత్ర దక్షగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ అదిరిపోయింది. గుహల మధ్యలో పురాతన వస్తువులను పరిశీలిస్తున్న విజువల్ చాలా క్యూరియాసిటీ క్రియేట్ చేసింది. ఫీల్డ్ డ్రెస్, గ్లవ్స్, గ్లాసెస్‌తో అంకిత భావం,ధైర్యం గల ఆర్కియాలజిస్ట్ గా మీనాక్షి అద్భుతంగా కనబడుతున్నారు. ఈ కథలో మీనాక్షి చౌదరి పాత్ర చాలా క్రూషియల్ గా ఉండబోతోంది. ఎమోషన్స్, పెర్ఫార్మెన్స్ కి స్కోప్ వుండే దక్ష క్యారెక్టర్ మీనాక్షి కెరీర్‌లో మైల్ స్టోన్ కానుంది.నాగ చైతన్య ఈ చిత్రంలో నెవర్ బిఫోర్ లుక్ లో కనిపించబోతున్నారు. 'లా పతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ ఈ సినిమాలో ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం వర్క్ చేస్తున్నారు. అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందించగా, రగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫర్. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సీక్వెన్స్ షూట్ జోరుగా కొనసాగుతోంది. లీడ్ కాస్ట్ మొత్తం షూట్‌లో పాల్గొంటున్నారు.

డాల్బీ ఆట్మాస్ సౌండ్ తో 'శివ' స్టన్నింగ్ గా అనిపించింది

శివ రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో కింగ్ నాగార్జున

కింగ్ నాగార్జున ఆల్ టైం కల్ట్ క్లాసిక్ 'శివ' బాక్సాఫీసు రికార్డులుని తిరగ రాస్తూ ఇండియన్ సినిమాను 'బిఫోర్ శివ', 'ఆఫ్టర్ శివ'గా రీడిఫైన్ చేసింది. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో1989లో విడుదలైన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మాతలు అక్కినేని వెంకట్ & సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా శివ చిత్రాన్ని 4K డాల్బీ ఆట్మాస్ లో నవంబర్ 14న థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ సమక్షంలో శివ రీరిలీజ్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో కింగ్ నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. అద్భుతమైన 4K విజువల్స్, డాల్బీ ఆట్మాస్ సౌండ్ తో ట్రైలర్ అదిరిపోయింది. ప్రతి సీన్‌లో టెన్షన్, ఎమోషన్ ఆడియన్స్ ని కట్టిపడేసింది. ట్రైలర్ చివర్లో నాగర్జున సైకిల్ చైన్ లాగిన సీన్ గూస్బంప్స్ క్రియేట్ చేసింది. శివ మ్యాజిక్ ని 4K డాల్బీ ఆట్మాస్ లో థియేటర్స్ లో చూడాలనే ఎక్సయిట్మెంట్ ట్రైలర్ మరింతగా పెంచింది.ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ... ఎంతో ప్రేమతో వచ్చిన మీ అందరికీ థాంక్యూ. ఈ సినిమాని మీ నాన్నగారు, అమ్మగారు థియేటర్స్ లో చూసుంటారు. వాళ్ళందరికీ థాంక్యూ. ఇప్పుడు అదే ప్రేమతో మీరు వచ్చారు. మీకు థాంక్యూ. అందరికంటే నా మిత్రుడు రామ్ గోపాల్ వర్మ కి థాంక్యూ. 36 ఏళ్ల క్రితం నాతో శివ సినిమా తీసి నన్ను పెద్ద స్టార్ ని చేశారు. పొద్దున్నే సినిమా చూశాను. స్టన్నింగ్ గా అనిపించింది. నవంబర్ 14న మీరందరూ కూడా శివని కొత్తగా ఎక్స్పీరియన్స్ చేయబోతున్నారు. రాజమౌళికి గారు అన్నట్టు ఆఫ్టర్ శివ బిఫోర్ శివ. శివ ఎప్పటికీ నిలిచిపోతుంది.



'ఫీనిక్స్' నాకు చాలా నచ్చింది

విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచమైన చిత్రం ఫీనిక్స్. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహించారు. ఏకే బ్రేవ్‌మ్యాన్ పిక్చర్స్ బ్యానర్ పై రాజలక్ష్మి 'అన్ల్' అరసు ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే తమిళ్ లో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ చిత్రం తెలుగులో నవంబర్ 7 రిలీజ్ కానుంది. ఈ సందర్భం మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. నేను జవాన్ సినిమా చేస్తున్నప్పుడు అనల్ అరసు మాస్టర్ ని కలిసాను. అప్పుడు ఈ కథ చెప్పారు. మా అబ్బాయి ఇందులో నటించాలని అన్నారు. మీ ఇద్దరు మాట్లాడుకోండి అని చెప్పాను. ఆ తర్వాత నాకు ఏమీ తెలియదు. వాళ్ళిద్దరే మాట్లాడుకున్నారు. సినిమా చేశారు. నేను సినిమా చూశాను. నాకు చాలా నచ్చింది. ఇది మా అబ్బాయికి చాలా మంచి ఆరంభం. ఒక తండ్రిగా నేను చాలా ఆనందంగా ఉన్నాను. తనకు చిన్నప్పటి నుంచి యాక్షన్ సినిమా చేయాలని ఉండేది. తనకి యాక్షన్ చాలా ఇష్టం. నన్ను యాక్షన్ సినిమాలు చేయమని చెప్తుండేవాడు. తనకి మాస్ యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. యాక్షన్ సినిమాని చాలా బాగా సెలబ్రేట్ చేసుకుంటాడు. అలాంటి సినిమాలు చేయడం తన కల. ఒకరోజు తను యాక్టర్ కావాలి అని చెప్పాడు. అలా చెప్పిన ఏడాదిలోనే సినిమా చేశాడు. అదంతా డైరెక్టర్ అనల్ అరసు మాస్టర్, నిర్మాత రాజ్యలక్ష్మి వలన సాధ్యపడింది. సినిమాకి సినిమా ఏ భాషలో ఉన్న అందులో ఎమోషన్ కనెక్ట్ అయితే ప్రతి ఒక్కరూ సినిమాని సెలబ్రేట్ చేస్తారు. అందుకే మనం అన్ని భాషలు సినిమాలు చూస్తాం. ఫినిక్స్ విషయంలో కూడా అది జరుగుతుంది. ఇందులో యాక్షన్ ఎమోషన్ అన్ని చాలా అద్భుతంగా కుదిరాయి. తప్పకుండా ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుంది. నవంబర్ 7న సినిమా రిలీజ్ అవుతుంది. అందరం థియేటర్స్ లో కలుద్దాం. అన్నారు.

'జిగ్రీస్' మీరేలే సాంగ్

కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్ "జిగ్రీస్". హరిష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తాజాగా మీరేలే సాంగ్ లాంచ్ చేశారు. సయ్యద్ కమ్రాన్ ఈ సాంగ్ ని ఫ్రెండ్ షిప్ మెలోడీగా కంపోజ్ చేశారు. హరీష్ రెడ్డి ఉప్పుల రాసిన లిరిక్స్ ఫ్రెండ్స్ మధ్య ఎమోషన్ ప్రజెంట్ చేశాయి. ఏక్‌నాథ్ వోకల్స్ సాంగ్ ని మరింత టచ్చింగ్ గా మార్చింది. ఈ సాంగ్ ఇన్స్టంట్ గా అందరికీ కనెక్ట్ అవుతుంది. జిగ్రీస్ ఫ్రెండ్షిప్, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది

'శంబాల' ఏ ఒక్కరినీ నిరాశపర్చదు

ఆది సాయికుమార్

ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్' ట్రైలర్ ఒక్కసారిగా అంచనాల్ని పెంచేసిన సంగతి తెలిసిందే. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ వంటి వారు నటిస్తున్నారు. రీసెంట్‌గా డార్లింగ్ ప్రభాస్ రిలీజ్ చేసిన ట్రైలర్ అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించింది. ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో చిత్రయూనిట్ మంగళవారం నాడు మీడియా ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో.. హీరో ఆది సాయి కుమార్ మాట్లాడుతూ .. 'మా టీజర్‌ను రిలీజ్ చేసిన దుల్కర్ కి, మాకు సపోర్ట్ చేసిన థమన్, నా స్నేహితుడు సందీప్ కిషన్, ట్రైలర్ రిలీజ్ చేసిన డార్లింగ్ ప్రభాస్ గారికి థాంక్స్. మా ప్రమోషనల్ కంటెంట్‌కు అన్ని చోట్లా పాజిటివ్ రెస్పాన్స్ వస్తుండటం ఆనందంగా ఉంది. మేం సినిమా మీద బజ్‌ను క్రియేట్ చేసే క్రమంలోనే ట్రైలర్‌ను ఇంత త్వరగా రిలీజ్ చేశాం. ప్రభాస్ ఫ్యాన్స్, సినీ లవర్స్ అందరూ కూడా మా ట్రైలర్‌ను మెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో మాకు సహకరించిన వంశీ, ప్రమోద్, ప్రసాద్ అన్నలకు థాంక్స్. ట్రైలర్ చూసి కిరణ్ అబ్బవరం అభినందించారు. రానా కూడా మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఈ మూవీకి తనవంతు సాయం చేస్తానని రానా మాటిచ్చారు. హిందీ రిలీజ్ గురించి కూడా అందరూ అడుగుతున్నారు. మీడియా నుంచి కూడా మాకు మంచి సపోర్ట్ లభిస్తోంది. మా నిర్మాతలు ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాకుండా ఈ మూవీని నిర్మించారు. ఈ చిత్రంతో వారికి మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నాను. యుగంధర్ ఈ మూవీని అద్భుతంగా రూపొందించారు. డిసెంబర్ 25న మా చిత్రాన్ని రిలీజ్ చేయబోతోన్నాం. మా చిత్రం కచ్చితంగా ఏ ఒక్కరినీ నిరాశపర్చదు. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. కంటెంట్ బాగుంటేనే జనాలు థియేటర్‌లకు వస్తున్నారు. ఇలాంటి ఓ డిఫరెంట్ కంటెంట్ మూవీని మీడియా, ఆడియెన్స్ ఆదరిస్తారని, సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200